ప్రతిపక్షం

www.prathipaksham.in

స్వదేశంలో టీ20 వరల్డ్ కప్ నా కల 8

సోమవారం 09.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 320 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

ఏ జిల్లాను రద్దు చేయం

కొత్త జిల్లా ఏర్పాటు చేయం

> జిల్లా పునర్విభజన జరిగితే అందరి అభిప్రాయాలు తీసుకుని, అసెంబ్లీలో చర్చించిన తర్వాతే నిర్ణయం ఉంటుంది. సింగరేణి కార్మికులకు అనువైన ప్రభుత్వం ఉంది. కార్మకులకు అండగానే నిర్ణయాలుంటాయి. సింగరేణి మెడికల్ బోర్డు రద్దు చేయాలన్న ఆలోచనే ప్రభుత్వం చేయడం లేదు. కార్మికుఃలకు నష్టం కలిగే ఏ నిర్ణయం తీసుకోం. మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలి. ఆడబిడ్డల ఆశీర్వాదం ఉంటే మోదీ, కేసీఆర్ తాత వచ్చినా ఓడిస్తాం.
>
> - సీఎం రేవంత్‌రెడ్డి

- జిల్లా పునర్విభజన జరిగితే అసెంబ్లీలో చర్చించిన తర్వాతే నిర్ణయం
- భూపాలపల్లి జిల్లా ఎక్కడికీ పోదు
- రాజకీయ లాభాల కోసం విషప్రచారాలు
- సింగరేణి కార్మికులకు అండగా ప్రభుత్వం
- కార్మికులకు నష్టం కలిగే ఏ నిర్ణయం తీసుకోం
- కేసీఆర్, మోదీని చూసి ఓటు వేయాలంటారు..
- గల్లీలో మోరీలు కేసీఆర్ వచ్చి తీస్తాడా?
- ఆడబిడ్డల ఆశీర్వాదం ఉంటే మోదీ, కేసీఆర్ తాత వచ్చినా ఓడిస్తాం
- భూపాలపల్లి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, భూపాలపల్లి

ఫిబ్రవరి 8 : 'రాష్ట్రంలో ఏ జిల్లాను రద్దు చేయడం గానీ, కొత్త జిల్లా ఏర్పాటు చేయడం గానీ ప్రభుత్వ పరిశీలనలో లేదు. జిల్లా పునర్విభజన జరిగితే అందరి అభిప్రాయాలు తీసుకుని, అసెంబ్లీలో చర్చించిన తర్వాతే నిర్ణయం ఉంటుంది. భూపాల పల్లి జిల్లా ఎక్కడికీ పోదు' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాత్కాలిక రాజకీయ లాభాల కోసం కుట్రలు, కుతంత్రాలతో విషప్రచారాలు చేస్తున్న వారిని ప్రజలు గమనించాలని సూచించారు. ఆదివారం భూపాలపల్లిలో 'ప్రజా పాలనప్రగతి బాట' బహిరంగ సభలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'కేసీఆర్, మోదీని చూసి ఓటు వేయాలంటారు..గల్లీలో మోరీలు కేసీఆర్ వచ్చి తీస్తాడా?' అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని సీఎం గుర్తు చేస్తూ, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పిన కేసీఆర్ పాలనలో టీవీలు, పత్రికలు, వేల కోట్ల వ్యాపారాలు కుటుంబానికి వచ్చాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు 'పేదల ఆత్మగౌరవాన్ని పట్టించుకోలేదు, పేదలపై ప్రేమ లేదు' అంటూ మండిపడ్డారు. ప్రతి నియోజకవర్గానికి

...:: మిగతా 2లో

అన్ని సాక్ష్యాలు సురక్షితం

నిరాధారమైన ఆరోపణలు వద్దు.. దుష్ప్రచారాలను ఆపండి

- అన్ని సాక్ష్యాలను కోర్టుకు తిరిగి అప్పగించాం
- ప్రమాద సమయంలో సాక్ష్యాలు ఎఫ్ఎస్ఎల్ లేవు
- ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ డైరెక్టర్ శిఖా గోయల్
- అగ్నిప్రమాదం వివరాలు మీడియాకు వెల్లడి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 8: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన ఓటుకు నోటు కుంభకోణం, అలాగే మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్), భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్), ఎమ్మెల్యే టి. హరీష్ రావు, ఇతర నాయకులు మరియు పోలీసు అధికారులకు సంబంధించిన ఫోన్ ట్యాపింగ్ కేసుతో సహా అన్ని సాక్ష్యాలు సురక్షితంగా ఉన్నాయని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) మరియు తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ డైరెక్టర్ శిఖా గోయల్ పేర్కొన్నారు. నాంపల్లిలో ఉన్న తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ కార్యాలయంలో అగ్నిప్రమాదం ఘటన వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు.

ఫైళ్లు సురక్షితం.. దుష్ప్రచారాలని ఆపండి

ప్రమాద స్థలానికి కొన్ని మీటర్ల దూరంలో ఉన్న మాలిక్యులర్ బయాలజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, గోయల్ మాట్లాడుతూ, ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి మరియు ఇతరులపై

...:: మిగతా 2లో



మార్చి 31 లోపు నక్సలిజం అంతం

మార్చి 31లోపు నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. మావోయిస్టుల ఏరివేత అంశంపై రాయ్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు.

7

మలేషియాలో యూపీఐ సేవలు

: ఇండియాలో దూసుకుపోతున్న యూపీఐ సేవలు త్వరలో మలేసియాలో కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ.. మలేసియా వేదికగా వెల్లడించారు.

7

సంఘ్ ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడే తప్పకుంటా

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ తన రిటైర్మెంట్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. వయసుతో సంబంధం లేకుండా తన పనిని కొనసాగించాలని, సంఘ్ తనను కోరిందని ఆయన పేర్కొన్నారు.

7



పట్టుదలతో ముందుకు సాగాలి

నేటి యువత జీవితంపై అతిగా ఒత్తిడి పడాల్సిన అవసరం లేదని, జీవితం ఎప్పుడూ ఒకే దారిలో సూటిగా సాగదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు.

7

బీజేపీని ఓడించేందుకు 100 కోట్ల డీల్

ఎంఐఎంతో కాంగ్రెస్ రహస్య సమావేశం

- పెద్ద ఎత్తున ఓట్లను కొని గెలవాలని కుట్ర
- కాంగ్రెస్, ఎంఐఎం వర్సెస్ బీజేపీ మధ్య ఆట మెదలైంది
- పాకిస్తాన్ ను చిత్తు చేసినట్లుగా కాంగ్రెస్, మజ్లిస్లకు బుద్ధి చెప్పండి
- కరీంనగర్ ను అభివృద్ధి చేసేందుకు అవకాశమివ్వండి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- కరీంనగర్ లో 'విజయ సంకల్ప ర్యాలీ"

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్

ఫిబ్రవరి 8: కరీంనగర్ లో కబడ్డీ ఆట మొదలైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇండియా పేరుతో బీజేపీ, పాకిస్తాన్ పేరుతో కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కలిసి కబడ్డీ ఆటను ప్రారంభించాయన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి 50 సీట్లు ఖాయమని తేలడంతో కబడ్డీ కప్ బీజేపీ గెలుచుకోవడం తథ్యమని తేలడంతో కాంగ్రెస్, ఎంఐఎం మధ్య రూ.100 కోట్ల డీల్ (మ్యాచ్ ఫిక్సింగ్) కుదిరిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ డబ్బుతో ఓట్లను కొనుగోలు చేసి

...:: మిగతా 2లో

పట్టణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్లు

- సొంతిల్లు లేని పేదలు లేకుండా చూడటమే లక్ష్యం
- గ్రామీణ ప్రాంతాల్లో నాలుగున్నర లక్షలు ఇళ్ల నిర్మాణం
- వైరా వాసిగా.. వైరా అభివృద్ధి నా బాధ్యత
- హైదరాబాద్, అమెరికా తరహాలో మధిర అభివృద్ధి
- ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్: రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలందరికి స్వంతింటి కల సాకారం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. త్వరలోనే పట్టణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఖమ్మం జిల్లా మధిరలో శనివారం జరిగిన మునిసిపల్ ఎన్నికల ప్రచారసభలో భట్టి మాట్లాడుతూ...ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంత ప్రజల కోసం నాలుగున్నర లక్షలు ఇళ్లను నిర్మించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో సొంతిల్లు లేని నిరుపేదలు లేకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్థలం ఉన్న లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద

...:: మిగతా 2లో

అగ్ని ప్రమాదం వెనుక కుట్ర

- మంటలు ఆర్పేందుకు మూడు గంటలు పట్టిందా?
- తుది దశకు ఓటుకు నోటు కేసు విచారణ
- ఆధారాలు మాయం చేయడానికి సీఎం పన్నిన కుట్ర
- ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదంపై కేటీఆర్ ధ్వజం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 8: ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదం వెనుక కుట్ర ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డినే ల్యాబ్‌ను తగులబెట్టించాడని ప్రజలంతా భావిస్తున్నారని తెలిపారు. ఆధారాలు నాశనం చేసి కేసు నుంచి బయటపడాలని రేవంత్ రెడ్డి స్వయంగా కుట్ర పన్ని ఫోరెన్సిక్ ల్యాబ్ లో ఆధారాలు కాల్చేశారని విమర్శించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో

...:: మిగతా 2లో

ఇండియా చేరుకున్న ప్రపంచ విజేతలు

పురుషుల అండర్ 19 వన్డే ప్రపంచకప్ విజేత భారత జట్టు సగర్వంగా స్వదేశంలో అడుగుపెట్టింది. ఆరోసారి రికార్డు టైటిల్‌తో యావత్ భారతావని గర్వపడేలా చేసిన ఆయుశ్ మాత్రే బృందం ఆదివారం ముంబై విమానాశ్రయంలో దిగింది. జగజ్జేతలుగా తిరిగొచ్చిన టీమిండియా క్రికెటర్లకు కుటుంబ సభ్యులు, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది, అభిమానులు ఘన స్వాగతం పలికారు.

...:: 8లో

...:: 3లో

కోహెడ మండలంలో పెద్దపులి సంచారం

- వ్యవసాయ బావుల వద్ద పశువులను చంపుకుతిన్న ఆనవాళ్లు
- భయాందోళనలో స్థానిక గ్రామాల ప్రజలు
- నంగునూరులో పులి పాదముద్రలను ధృవీకరించిన అధికారులు
- ఆధారాలు సేకరిస్తున్న అటవీ అధికారులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

రాజకీయం

అన్ని సాక్ష్యాలు సురక్షితం

మొదటిపేజీ తరువాయి

నమోదైన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి కోర్టు (ఏసీబీ) నుండి జూన్ 12 మరియు జూలై 14, 2015 తేదీలలో రెండు వేర్వేరు సందర్భాలలో 16 వస్తువులు అందినట్లు తెలిపారు. "అన్ని సాక్ష్యాలను 2015 సంవత్సరంలో పరిశీలించి, మార్చి 2021లో కోర్టుకు తిరిగి అప్పగించాము. ఈ కేసులకు సంబంధించిన ఏ వస్తువులూ అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)లో లేవు," అని గోయల్ అన్నారు. మంటల్లో కాలిపోయాయని ఫోన్ ట్యాపింగ్ కేసు సంబంధిత ఫైళ్లపై ఆమె మాట్లాడుతూ అవి నిరాధారమైన ఆరోపణలని, దుష్ప్రచారాలని ఆపాలని అన్నారు. మార్చి 2024 నుండి జనవరి 2026 వరకు వివిధ తేదీలలో ఎఫ్ఎస్ఎల్‌కు మొత్తం 132 సాక్ష్యాలు అందినట్లు ఆమె స్పష్టం చేశారు. "ఈ ఏడాది జనవరిలో అందిన ఏడు వస్తువులు మినహా, ప్రతి ఫైల్‌ను పరిశీలించి, వివిధ తేదీలలో పంపిన అధికారికి తిరిగి అప్పగించాము. పరీక్షలు పూర్తయ్యాయి మరియు నివేదికలు తయారీ ప్రక్రియలో ఉన్నాయి," అని తెలిపారు. "అందిన మొత్తం సాక్ష్యాలలో కొన్నింటిని ఇప్పటికే పంపిన అధికారికి తిరిగి అప్పగించాము. ఈ కేసులకు సంబంధించిన అన్ని సాక్ష్యాలు సురక్షితంగా తిరిగి భద్రపరిచామని," అని గోయల్ హామీ ఇచ్చారు. కార్యాలయంలో కొంత నష్టం జరిగిందని, వాటిని కూడా త్వరలోనే పునరుద్ధరిస్తామని ఆమె చెప్పారు. ప్రమాదం జరిగినప్పటి నుండి, పెద్ద మొత్తంలో కేసు సంబంధిత వస్తువులు, అధారాలను తిరిగి స్వాధీనం చేసుకుని భద్రతపరిచామని అని ఆమె అన్నారు. నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు.

ఏ జిల్లాను రద్దు చేయం

మొదటిపేజీ తరువాయి

3,500 ఇందిరమ్మ ఇళ్లు, మొత్తం 4.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి 22,500 కోట్లు కేటాయించామని, వచ్చే బడ్జెట్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని సీఎం ప్రకటించారు. "ఆడబిడ్డల ఆశీర్వాదం ఉండేలా పేదల ఆత్మగౌరవం పెంచే ఇళ్లు ఇస్తాం" అని స్పష్టం చేశారు.

కార్మికులకు నష్టం కలిగే ఏ నిర్ణయం తీసుకోం

నల్ల బంగారాన్ని వెలికితీస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిన సింగరేణి కార్మికులు, తెలంగాణ ఉద్యమంలో పిడికిలి బిగించి పాల్గొన్నారని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులపై జరుగుతున్న విషప్రచారాలను సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. కార్మికులకు అనువైన ప్రభుత్వం ఉందని, కార్మకులకు అండగానే నిర్ణయాలుంటాయని సీఎం స్పష్టం చేశారు. సింగరేణి మెడికల్ బోర్డు రద్దు చేయాలన్న ఆలోచనే ప్రభుత్వం చేయడం లేదని, కార్మికుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం చేస్తుంది తప్ప, కార్మికులకు నష్టం కలిగే ఏ నిర్ణయం తీసుకోదని అన్నారు. వారసత్వ ఉద్యోగాలపై న్యాయం చేస్తామని, 217 మంది డిస్మిస్ కార్మికుల సమస్యను తప్పకుండా పరిష్కరిస్తాం అని సీఎం హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికులు నిండు మనసుతో కాంగ్రెస్ జెండాను మోయడం వల్లే ఈ ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉందని సీఎం తెలిపారు. ఈ ప్రభుత్వం వారిదే వారికి నష్టం చేసే పని చేయం అని తేల్చిచెప్పారు. ఫోన్ ట్యాపింగ్, వ్యాపారుల బ్లాక్‌మెయిల్ అంశాలపై బీఆర్ఎస్ పార్టీ నేతల తీరుపై సీఎం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇక నుంచి 'బీఆర్ఎస్ అంటే బ్లాక్‌మైల్ రాజకీయ సమితి' అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం, ఫార్ములా ఈ రేస్ కేసుల్లో సీబీఐ విచారణకు ఎవరు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. సరస్వతి పుష్కరాలు అద్భుతంగా నిర్వహించామని, మేడారం ఆలయం వెయ్యేళ్లు గుర్తుండేలా నిర్మించామని, సమ్మక్క-సారలమ్మ జాతరను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దామని సీఎం చెప్పారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి బాసర నుంచి భద్రాచలం వరకు 3-4 వేల కోట్లతో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం అని ప్రకటించారు. మున్సిపాలిటీలకు రూ. 17,442 కోట్లు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు 6,116 కోట్లు, భూపాలపల్లి మున్సిపాలిటీకి 92 కోట్లు మంజూరు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

భూపాలపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఉన్న ఘనమైన చరిత్రను గుర్తు చేస్తూ, ప్రపంచలో భారత దేశ గౌరవం పెంచిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఈ నేల బిడ్డేనని, తొలి తెలంగాణ ఉద్యమం నుంచి మలిదశ ఉద్యమం వరకు కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు కర్త-క్రియలుగా పోరాడారని సీఎం గుర్తు చేశారు. తెలంగాణ సాధనలో ముందుభాగంలో నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ కూడా ఈ ప్రాంతానికే చెందినవారని పేర్కొన్నారు. బీజేపీ-బీఆర్ఎస్ వేరు వేరు కాదని, ఒకే బొమ్మ-బొరుసులా కాంగ్రెస్‌ను ఓడించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. "భూపాలపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలి. ఆడబిడ్డల ఆశీర్వాదం ఉంటే మోదీ, కేసీఆర్ తాత వచ్చినా ఓడిస్తాం" అంటూ ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ బహిరంగ సభ వేదిక నుంచి ముఖ్యమంత్రి 'సమ్మక్క సారలమ్మ జిల్లా మహిళా సమాఖ్య'కు 205 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ చెక్కును అందజేశారు.

మున్సిపల్ ఎన్నికలలో బీసీల ఓటు బీసీలకే

- జనరల్ స్థానాలు అంటే రెడ్డి, రావులవి కావు
- బీసీలను పార్టీలకు అతీతంగా గెలిపించండి
- బీసీ రిజర్వేషన్లు తగ్గించి అన్యాయం చేశారు
- రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీకి సిద్ధాంతాలు లేవు
- బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో జరిగే మున్సిపల్ ఎన్నికలలో రాజకీయ పార్టీల అతీతంగా జనరల్ స్థానాలలో ఎన్నికల బరిలో నిలబడిన బీసీలను గెలిపించాలని బీసీ జేఏసీ నిర్ణయించినట్లు బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఆదివారం హైదరాబాదులోని బీసీ జేఏసీ రాష్ట్ర కార్యాలయంలో బీసీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశం బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అధ్యక్షతన, బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామి సమన్వయంతో జరిగింది. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలలో మూడు కార్పొరేషన్ లలో జరుగుతున్న ఎన్నికలలో ఓటు మనదే సీటు మనదే, బీసీల ఓటు బీసీలకే అనే నినాదంతో బీసీ ప్రజలు రాజకీయ పార్టీలకు అతీతంగా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో బీసీ బిడ్డలను గెలిపించి తెలంగాణ రాష్ట్రంలో బీసీల రాజకీయ ఐక్యతను, సామాజిక చైతన్యాన్ని ప్రదర్శించాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ బీసీలకు పిలుపునిచ్చారు. పది శాతం ఉన్న అగ్రకులాలు 50% జనరల్ స్థానాలలో పోటీ చేస్తున్నారని, జనరల్ స్థానాలు అంటే రెడ్డి రావుల వి కావని ఆయన అన్నారు. 60 శాతం ఉన్న బీసీలకు 28 శాతమే రిజర్వేషన్లు కల్పించారని, రిజర్వేషన్లు లేని చోట జనరల్ స్థానాలలో నిలబడిన బీసీలను గెలిపించడం ద్వారా బీసీలకు రాజకీయంగా న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఏ రాజకీయ పార్టీకి సిద్ధాంతాలు లేవని ఒకవేళ సిద్ధాంతాలు ఉంటే నైతిక విలువలతో ఏ పార్టీకి ఆ పార్టీ ఇతరులతో పొత్తు లేకుండా ఎన్నికల్లో పోటీ చేసేవని కానీ నేడు విచిత్రంగా బద్ధ విరోధులమని చెప్పుకునే పార్టీలు అపవిత్ర అక్రమ పొత్తులతో గెలవాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లు తగ్గించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం చేయాలని చూశాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకి బుద్ధి చెప్పాలంటే మున్సిపల్ ఎన్నికలను ఒక వేదికగా చేసుకుని బీసీలు రాజకీయ పార్టీలను చూసిన నేర్చుకోవాలని, వారు సిద్ధాంతాలు తప్పి పొత్తులు పెట్టుకుంటే లేని తప్పు బీసీలకు ఎందుకని అందుకే ఎన్నికలలో రాష్ట్రంలోని 136 కులాల బీసీలు సోదర ఎస్సీ ఎస్టీ మైనార్టీ కులాలు పొత్తు పెట్టుకుని బీసీలను అత్యధికంగా గెలిపించుకుని బీసీల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ బీసీ సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, జేఏసీ నేతలు మాదేశి రాజేందర్ గంగపుత్ర, గజ్జల సత్యరాజ్ గౌడ్, వెంకటేష్ గౌడ్, మహేష్ మేరు, నయనంపల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

అగ్ని ప్రమాదం వెనుక కుట్ర

మొదటిపేజీ తరువాయి

కేటీఆర్ మాట్లాడుతూ.. మేమంతా మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఉండగా రేవంత్ రెడ్డి ఈ కుట్ర చేశారని ఆరోపించారు. ఓటుకు నోటు కేసు జగద్విదితమని కేటీఆర్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి 2015లో ఎమ్మెల్యేలను కొనడానికి వచ్చి రూ.50లక్షల బ్యాగుతో కెమెరాల ముందు దొరికాడని గుర్తుచేశారు. ఈ కేసు నుంచి బయటపడటానికే రేవంత్ రెడ్డి కుట్ర చేశాడని అన్నారు. ఓటుకు నోటు కేసు విచారణ న్యాయస్థానంలో తుది దశకు వచ్చిందని తెలిపారు. చివరి దశలో ఆధారాలు మాయం చేయడానికి పన్నిన కుట్ర అని అనుమానం వ్యక్తం చేశారు.

చలికాలంలో అగ్ని ప్రమాదాలు జరుగుతాయా

దొంగతనం చేసి దొరికిపోవడం రేవంత్ రెడ్డికి అలవాటే అని కేటీఆర్ విమర్శించారు. అగ్ని ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయి? చలికాలంలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరుగుతాయా అని ఆయన నిలదీశారు. 'చలికాలం పొద్దున 10 గంటలకు అగ్ని ప్రమాదం జరిగిందట.. రేవంత్ రెడ్డి చెప్పే మాటలు మనం నమ్మాలా' అని ప్రశ్నించారు. ఇది చేయించబడిన అగ్ని ప్రమాదం అని అన్నారు. నేరాల విచారణలో ఫోరెన్సిక్ కీలక విభాగమని కేటీఆర్ తెలిపారు. వేలాది కేసుల వివరాలు అగ్గికి బుగ్గి అయ్యాయని పేర్కొన్నారు. ఎంతోమంది క్రిమినల్స్ తప్పించుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టీజీఎఫ్ఎస్ఎల్ ప్రకటన తూతూ మంత్రంగా ఉందని తెలిపారు. ఏం నష్టం జరగలేదంటూ డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఒక ఇన్‌స్పెక్టర్ నిజాయితీగా పనిచేశాడని చెప్పారు. ఉదయం 10 గంటలకు అగ్ని ప్రమాదం జరిగినట్లు ఎఫ్ఐఆర్‌లో స్పష్టంగా రాశారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల దాకా మంటలు అదుపు చేయలేదని.. బుద్ధ బిల్డింగ్‌లో మంటలు ఆర్పడానికి మూడు గంటలు పట్టిందా అని ప్రశ్నించారు.

సర్వర్‌లు కాలబెట్టినంక ఇంకేం ఉంటుంది

ముఖ్యమైన కేసుల సమాచారం అంతా మొదటి అంతస్తులోనే ఉందని తెలిపారు. 'ఉదయం 10 గంటలకు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ఎవరూ డ్యూటీలో లేరట.. మీడియాను మేనేజ్ చేసి తిమ్మిని బమ్మి చేశారని' మండిపడ్డారు. ఏం జరగలేదని తప్పు అని ఒక ఇన్‌స్పెక్టర్ చెప్పారని తెలిపారు. సర్వర్ రూమ్ కూడా కాలిపోయిందని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారని చెప్పారు. సర్వర్‌లు కాలబెట్టినంక ఇంకేం ఉంటుందని కేటీఆర్ ప్రశ్నించారు. కుట్ర విజయవంతంగా పూర్తిచేశారని అన్నారు. 50 కంప్యూటర్లు తగలబడ్డాయని చెబుతున్నారని తెలిపారు. ఒక ప్రభుత్వం తమ ప్రభుత్వ కార్యాలయాన్నితామే కాల్చిపారేయడం దేశంలో ఎక్కడా జరగదని విమర్శించారు.

రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఈ కుట్రను కేంద్రం నిగ్గుతేల్చాలని కేటీఆర్‌కోరారు. రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇది కుట్రపూరితంగా జరిగిందే.. ప్రమాదం కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వేల కేసుల ఆధారాలు బుగ్గి చేశారని కేటీఆర్ మండిపడ్డారు. మేం సైంటిస్టులను తీసుకొని వస్తం.. మమ్మల్ని రానివ్వండి అని కోరారు. సీఎం రేవంత్ రెడ్డితో లాలూచీ లేకపోతే.. కేంద్రం ఎంక్వైరీ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ వచ్చి ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని అంటాడని.. బడే భాయ్, ఛోటే భాయ్ బంధం లేకపోతే వెంటనే విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కుంభకోణాన్ని మేం బయట పెట్టినం.. సీఎం బామ్మర్ది పాత్ర ఉందని బయటపెట్టినం.. కానీ కేంద్రం విచారణ జరపడం లేదని తెలిపారు. దారుణ నేరానికి ఒడిగట్టిన నేరగాడిని బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను ఏప్రిల్ తర్వాత ఇస్తాం. గోదావరి సింగరేణి మెడికల్ బోర్డును రద్దు చేసే యోచన లేదు. సింగరేణి కార్మికులకు నష్టం చేకూర్చే ఏ పనిని ప్రభుత్వం చేపట్టదు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహక ప్రాంతాలను, దేవాలయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తాం. ఇందుకోసం రూ.3వేలకోట్లయినా ఖర్చు చేస్తాం.

- చెల్పూర్ సభలో సీఎం రేవంత్

బీజేపీని ఓడించేందుకు 100 కోట్ల డీల్

మొదటిపేజీ తరువాయి

బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ లోని మీడియా, సోషల్ మీడియాసహా యువకులంతా కుల, మతాలకు అతీతంగా ఒక్కటై కాంగ్రెస్, ఎంఐఎం చేస్తున్న కుట్రలను వివరించి బీజేపీని బంపర్ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో కరీంనగర్ లో భారీ ఎత్తున ''విజయ సంకల్ప ర్యాలీ'' నిర్వహించారు. బీజేపీ తెలంగాణ ఇంచార్జీ, మహారాష్ట్ర ఐటీ మంత్రి ఆశీష్ షెల్లార్, మాజీ ఎంపీ, సినీ నటి నవనీత్ కౌర్ ముఖ్య ఈ ర్యాలీకి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కరీంనగర్ కలెక్టరేట్ రెవిన్యూ గార్డెన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీలో కనీవినీ ఎరగని రీతిలో వేలాది మంది కాషాయ పగిడీలు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం టవర్ సర్కిల్ వద్ద కాషాయ ప్రభంజనాన్ని ఉద్దేశించి బండి సంజయ్, నవనీత్ కౌర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ 'అభివృద్ధి నినాదంతో మేం ప్రజల వద్దకు పోతే కరీంనగర్ ఎన్నికలకు వెళితే ఏం జరుగుతోందో... ఏ విధంగా కాషాయ సంద్రమైందో చూస్తున్నారు కదా... కరీంనగర్ కార్పొరేషన్ లో బీజేపీ 50 సీట్లు గెలిచి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోబోతోందని సర్వేలన్నీ తేల్చడంతో కాంగ్రెస్, ఎంఐఎం నేతల వెన్నులో వణుకు మొదలైంది. అందుకే ఒవైసీ నిన్న రాత్రి కరీంనగర్ కు వచ్చి ఎంఐఎం గేర్ మారుస్తుందని మాట్లాడుతున్నడు.' అని అన్నారు. 'బండి సంజయ్‌కు, బీజేపీ వాళ్లు వాళ్ల భార్యల కంటే నన్నే ఎక్కువ ఇష్టపడతారని ఒవైసీ మాట్లాడుతున్నడు. అరే ఓవైసీ... నీకు తెలుసా? బీజేపీ నేతలకు కుటుంబం కంటే.. దేశం, ధర్మమే ముఖ్యం.. దుష్ట శిక్షణ కోసం కొన్నిసార్లు ఇంటిని కూడా మర్చిపోతం. రామాయణం లో రాముడికి ఎప్పుడు రావణుడే గుర్తొచ్చాడు కదా.. మహాభారతం లో పాండవులకు కౌరవులే గుర్తొచ్చారు కదా. ఈ బండి సంజయ్‌కు కూడా ఒవైసీనే గుర్తుకొస్తున్నడు. రామాయణం, మహాభారతంలో రావణుడు, కౌరవులకు ఏం గతి పట్టిందో ఎంఐఎంకు కూడా అదే గతి పట్టించేదాకా విశ్రమించే ప్రసక్తే లేదు.' అని ధ్వజమెత్తారు. 'కరీంనగర్ కు రక్షణ కవచంగా నేనుంటా. మీ జెండాలను పక్కన పెట్టండి. అందరూ ఒక్కటై ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పండి. కరీంనగర్ కార్పొరేషన్, టవర్ సర్కిల్ మీద పొరపాటున మజ్లిస్ పచ్చ జెండా ఉంటే ఎట్లుంటదో ఆలోచించండి. అదే సమయంలో ఈ కార్పొరేషన్, టవర్ సర్కిల్ పై కాషాయ జెండా రెపరెపలాడుతుంటే ఎంతటి కనువిందు చేస్తుందో ఆలోచించాలని కోరుతున్నా.' అని అన్నారు. మున్సిపల్ ఎన్నికలకు ఇంకా ఉన్నది రెండ్రోజులే. మీడియా, సోషల్ మీడియా కార్యకర్తలతోపాటు యువకులంతా ఈ రెండ్రోజుల సమయం మాకు ఇవ్వండి. రాజకీయాలకు అతీతంగా బీజేపీని గెలిపించండి. ఈ కరీంనగర్ కు రక్షణ కవచంగా నేను ఉంటానని అన్నారు. 'కులాలు, వర్గాలు, వర్ణాల, డివిజన్ల పేరుతో విడిపోతే పచ్చ పార్టీ గెలిస్తే కరీంనగర్ పరిస్థితి ఎట్లుంటదో ఒక్కసారి ఆలోచించండి. ఈ నెల 11 న జరిగే పోలింగ్ నాడు దేశాన్ని, ధర్మాన్ని, మన హిందూ సమాజాన్ని గుర్తు చేసుకుని కమలం పువ్వు గుర్తుకు ఓటేయండి' అని బండి సంజయ్ కోరారు.

పట్టణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్లు

మొదటిపేజీ తరువాయి

ఇల్లు మంజూరు చేస్తామని, స్థలం లేని వారికి జీ ప్లస్ టు తరహా నివాసాలను నిర్మించి ఇస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కష్ట పడుతుందన్నారు. అన్ని జిల్లాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పెట్టుకొని ప్రభుత్వ అనేక నిర్ణయాలను తీసుకుంటుందని ఆయన అన్నారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారు గృహప్రవేశాలు కూడా చేస్తున్నారు. ఏప్రిల్ నుంచి ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ళు 2025-26 ఆర్థిక సంవత్సరానికి మంజూరైన ఇళ్లలో 53శాతం వరకు ఇప్పటివరకు పురోగతి సాధించాయి. ఇంకా 47శాతం ఇళ్ళ పనులు పూర్తి కావలసి ఉంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో భాగంగా ఏప్రిల్ నుంచి ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ళను కేటాయిస్తున్నారు. అయితే 2025 26 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్ మినహాయించి తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటివరకు 3,69,014 ఇళ్ళను కేటాయించగా ఇందులో రెండున్నర లక్షల ఇళ్ల గ్రౌండింగ్ పూర్తయింది.

వైరా అభివృద్ధి నా బాధ్యత

వైరా అభివృద్ధి నా బాధ్యత అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైరా పట్టణంలో జరిగిన కార్నర్ మీటింగ్ లో ఆయన మాట్లాడారు. 'వైరా వాసిగా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా వైరా పట్టణ సమగ్ర అభివృద్ధి బాధ్యతను పూర్తిగా స్వీకరిస్తున్నాను' అని వెల్లడించారు. ఈ ఎన్నికలు కేవలం ఓటింగ్ కార్యక్రమం కాదని వైరా భవిష్యత్తును నిర్ణయించే తీర్పు అని అన్నారు. అభివృద్ధి దిశగా ముందుకు సాగాలా, లేక గత నిర్లక్ష్య పాలనను కొనసాగించాలా అన్నది ప్రజలు ఆలోచించి నిర్ణయించాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే వైరాలో అభివృద్ధి జరిగిందని, రూ.200 కోట్లతో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, 100 పడకల ఆసుపత్రి, జూనియర్ కాలేజీ, ఐటీఐను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌గా అభివృద్ధి చేయడం, పాలిటెక్నిక్ మంజూరు వంటి కార్యక్రమాలు వైరా భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. చిన్న వ్యాపారుల కోసం షాపింగ్ కాంప్లెక్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాలువల లైనింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థులందరినీ గెలిపించాలని వైరా ప్రజలను కోరుతున్నానని అన్నారు. మధిరలో మాట్లాడుతూ మధిర అంటే నాకు ప్రాణమని, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి, ఈ రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం కల్పించిన మీ రుణం తీర్చుకోవడమే నా ఏకైక లక్ష్యం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్, అమెరికా తరహాలో మధిరలో అత్యున్నత వైద్య రక్షణ సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. అభివృద్ధి అంటే మధిర అన్నట్టుగా రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలుపుతానని, ఈ మహాయజ్ఞంలో తోడుగా నిలిచేందుకు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.

'భూభారతి'లో భూ సమస్యలు ఉండవు

- ఏప్రిల్‌లో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- భూపాలపల్లిలో 'ప్రజా పాలన-ప్రగతి బాట' బహిరంగ సభ

ప్రతిపక్షం, భూపాలపల్లి, ఫిబ్రవరి 8: కొత్త భూభారతి చట్టంలో భూ సమస్యలు ఉండవవని, ఎటువంటి భూ సమస్య లేకుండా చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. భూపాలపల్లిలో నిర్వహించిన "ప్రజా పాలనప్రగతి బాట" బహిరంగ సభలో పొంగులేటి మాట్లాడుతూ వచ్చే ఏప్రిల్ లో కేబినెట్ లో నిర్ణయం తీసుకొని 2వ విడత ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభిస్తామన్నారు. అర్హులైన పేదవారికి 100 శాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతంలో చాలా చోట్ల భూములకు సరైన పత్రాలు లేవని తెలిపారు. సంక్షేమ పథకాలు అందజేయడం వల్లే సర్పంచ్ ఎన్నికల్లో 68 శాతానికి పైగా గెలిచారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు.

అబద్ధాలు పుట్టిందే బీఆర్ఎస్ పార్టీతో.. : ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి జిల్లా పోతుందంటూ మున్సిపల్ ఎన్నికల వేళ.. బీఆర్ఎస్ అభ్యర్థులు అబద్ధాలు చెబుతున్నారంటూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మండిపడ్డారు. భూపాలపల్లిలో నిర్వహించిన ప్రజాప్రభుత్వం, ప్రజల బాట సదస్సులో ఆయన మాట్లాడుతూ అబద్ధాలు పుట్టిందే బీఆర్ఎస్ పార్టీతో అని ఆయన ఎద్దేవా చేశారు. పాత రేషన్ కార్డులో పేర్లు ఎక్కించలేని పరిస్థితి గత ప్రభుత్వంలో ఉందని గుర్తు చేశారు. సింగరేణి కార్మికుల్లో సుమారు 200మంది డిస్మిస్ అయ్యారని వారికి తిరిగి ఉద్యోగాలు వచ్చేలా చేయాలని స్పష్టం చేశారు.

మహిళలను కోటీశ్వరులు చేయడమే సీఎం రేవంత్ లక్ష్యం : ఎంపీ కడియం కావ్య

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని వరంగల్ ఎంపీ కడియం కావ్య స్పష్టం చేశారు. అలాగే భూపాలపల్లికి రైల్వే లైన్ కావాల్సి ఉందన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రభుత్వంలో ఉన్న వారికి ఓటు వేస్తేనే అభివృద్ధి జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు.

కొడవటంచ లక్ష్మి నృసింహా స్వామి సన్నిధిలో..

ప్రజాపాలన ప్రగతిబాట కార్యక్రమంలో భాగంగా ఈరోజు భూపాలపల్లి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పొంగులేటి రేగొండ మండలం, కొడవటంచ శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. దేవాలయ అభివృద్ధి పనుల్లో జిల్లా ఇంచార్జ్ మంత్రిగా భాగస్వాములు కావడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని మంత్రి పొంగులేటి అన్నారు. అనంతరం చెల్పూర్ లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ఇందిరమ్మ చీరలు కట్టుకొని వచ్చిన ఆడబిడ్డల ఆనందం సభలో చూస్తుంటే తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేసిన ప్రగతి తేజస్సు కనిపించిందని మంత్రి అన్నారు. గత పదేళ్ల పాలనలో పేదల ఆత్మగౌరవ చిహ్నమైన ఇండ్లను గత పాలకులు కట్టించలేదని, ప్రజాప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే మొదటి విడత నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లను అందించడం జరిగిందని, ఏప్రిల్ లో రెండో విడత ప్రారంభమవుతుందని, ఆ తరువాత కూడా మరో మూడు విడతల్లో అర్హులైన పేదలకు సొంతిల్లు ఇస్తామని అన్నారు. అదే విధంగా కొన్ని దశాబ్దాలుగా రాష్ట్రంలో కొన్ని సర్వే నెంబర్లలో భూ వివాదాలు ఉన్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నభూ యజమానులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. అటువంటి భూ వివాదాలను పరిష్కరించేందుకు భూభారతి చటాన్ని తీసుకొచ్చామని, లైసెన్సుడ్ సర్వేయర్లను నియమించి, సర్వేలు ప్రారంభించామని, త్వరలోనే ఇలాంటి భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. మీ చల్లని దీవెనలు ప్రజాప్రభుత్వంపై ఎల్లప్పుడూ ఉండాలని, ఈనెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికలలో అభివృద్ధి కాంక్షించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

రాహు కేతువుల నుంచి రాష్ట్రాన్ని కాపాడండి

- రేవంత్ రాహువు.. కేసీఆర్ కేతువు అంటూ ధ్వజం
- రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పల ఊబిలో ముంచింది
- ఇచ్చిన హామీలు కాంగ్రెస్ అమలు చేయడం లేదు
- టీ బీజేపీ చీఫ్ రామచందర్‌రావు ధ్వజం

ప్రతిపక్షం, కొత్తగూడెం, ఫిబ్రవరి 8: తెలంగాణ ముఖ్యమంతి రేవంత్ రెడ్డి రాహువు అయితే.. బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కేతువు అని టీబీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అభివర్ణించారు. రాహు కేతువుల నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడాలంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెంలో బీజేపీ విజయ సంకల్ప సభ పేరిట నిర్వహించిన భారీ సభలో ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిందని బీఆర్ఎస్ పార్టీ అని విమర్శించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో ఒక్కటి మినహా హామీల అమలులో విఫలమైందంటూ మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే కేంద్ర పథకంతో ఇంటింటికీ తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ వస్తుందన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో పన్నుల వసూళ్లు మినహా పనులు లేవని రాంచందర్ రావు వ్యంగ్యంగా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొనటం వెనుక ఉన్న ఆంతర్యాన్ని గమనించాలంటూ ప్రజలకు సూచించారు. కేంద్రంలోని ఎన్డీయే కూటమి తీసుకువచ్చిన అమృత్ పథకంతో కొత్తగూడెం కార్పొరేషన్ ఆధునీకరణ పనులు చేపడతామన్నారు. కాంగ్రెస్ పార్టీలోని వర్గ పోరుతో కుంభకోణాలు బట్టబయలు అవుతున్నాయని పేర్కొన్నారు. సింగరేణిలో నైనీ టెండర్ల రద్దు వెనుక కుంభకోణం ఉందని ఆరోపించారు. సింగరేణిలో అప్పుల కారణంగా జీతాలు ఇచ్చే స్థాయిని దిగజార్చారంటూ పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ సూచనల మేరకు సింగరేణిపై ఇటీవల కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సమీక్షించారని గుర్తు చేశారు. సింగరేణిలోని సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా కార్మికులకు తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు హామీ ఇచ్చారు. రాష్ట్ర కేబినెట్ లోని బీసీల లెక్క తేల్చాలంటూ రేవంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసన సభలో సభ్యత్వం లేకుండా ఒక ముస్లింకి మంత్రి పదవి కేటాయించారంటూ అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు మండిపడ్డారు. ఈ రెండు పార్టీలవి ఒకే విధానాలని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కుంభకోణాల ఫైల్స్ కాలిపోయాయని.. దీంతో వాస్తవాలు బట్టబయలు కాకుండా కుట్ర జరిగిందంటూ టీబీజేపీ చీఫ్ నిప్పులు చెరిగారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన ఎఫ్ఎస్ఎల్ ఫైల్స్ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో తగులబడటం వెనుక ఆంతర్యాన్ని గమనించాలంటూ ప్రజలకు ఈ సందర్భంగా టీ బీజేపీ చీఫ్ హితవు పలికారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి కేసును 10 ఏళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. అవినీతి విచారణల్లో అధికారులను అరెస్ట్ చేశారని.. మరి నాయకులపై చర్యలు ఏవంటూ ఆయా పార్టీల నేతలను సూటిగా ప్రశ్నించారు. తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిద్దాం, తెలంగాణను కాపాడుకుందామంటూ ప్రజలకు టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు స్పష్టం చేశారు.

టీజీ లాసెట్ నోటిఫికేషన్

- ఫిబ్రవరి 10 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తుకు చివరి తేదీ ఏప్రిల్ 1.. మే 18న పరీక్ష
- విడుదల చేసి ఉస్మానియా వర్సిటీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 8: 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి టీజీ లాసెట్, పీజీ లాసెట్ నోటిఫికేషన్‌ను ఉస్మానియా విశ్వవిద్యాలయం విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లా కాలేజీల్లో 3 ఇయర్స్, 5 ఇయర్స్ ఎల్ఎల్ బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తుల ప్రక్రియ ఫిబ్రవరి 10, 2026న ప్రారంభం అవుతుంది. లాసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ ఏప్రిల్ 1 తో ముగుస్తుంది. దరఖాస్తుల సవరణ ప్రక్రియ మే 3 నుంచి మే 8 వరకు ఉంటుంది. ఇక మే 12 నుంచి హాల్ టికెట్లు జారీ చేస్తారు. మే 18వ తేదీన పరీక్ష నిర్వహిస్తారు. ఫీజు వివరాలు విషయానికి వస్తే.. సాధారణ అభ్యర్థులకు రూ. 900, ఎస్సీ/ఎస్టీ/పీహెచ్ అభ్యర్థులకు రూ. 600. పీజీలాసెట్ సాధారణ అభ్యర్థులకు రూ. 1100, ఎస్సీ/ఎస్టీ/పీహెచ్ అభ్యర్థులకు రూ. 900. మే 18న మొత్తం మూడు సెషన్లలో పరీక్ష జరుగుతుంది. ఉదయం 9:30 నుండి సాయంత్రం 5:30 వరకు వేర్వేరు కోర్సులకు షెడ్యూల్ ఖరారు చేశారు. ప్రాథమిక 'కీ'ని మే 23న విడుదల చేసి, జూన్ 5న తుది ఫలితాలను ప్రకటించనున్నారు.

కోహెడ మండలంలో పెద్దపులి సంచారం

- వ్యవసాయ బావుల వద్ద పశువులను చంపుకుతిన్న ఆనవాళ్లు
- భయాందోళనలో స్థానిక గ్రామాల ప్రజలు
- నంగునూరులో పులి పాదముద్రలను ధృవీకరించిన అధికారులు
- ఆధారాలు సేకరిస్తున్న అటవీ అధికారులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి 8: సిద్ధిపేట జిల్లా కోహెడ మండలంలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. కోహెడ మండలం బస్వాపూర్ ఆరెపల్లి తండాలో పులి ఏకంగా ఐదు ఆవులను చంపేసింది. చంద్ర నాయక్ తండా వ్యవసాయ బావుల వద్ద పశువులను పెద్ద పులి చంపుకు తిన్న ఆనవాళ్లు కనిపిస్తుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఉదయం పూట పెద్ద పులి పశువులను చంపుకు తింటుండడాన్ని దూరం నుండి చూశానని తండా రైతు రాములు తెలిపారు. అంతకుముందు ఆదివారం తెల్లవారుజామున నంగునూరు మండలం ఘనపూర్‌లో ఓ లేగ దూడను చంపింది. యాదాద్రి జిల్లా నుంచి ఈ పులి జనగామ జిల్లా అమ్మపురం మీదుగా సిద్దిపేట జిల్లాలోని దూల్మిట్ట, మద్దూరు మండలాలకు చేరుకుని అక్కడి నుంచి నంగునూరు మండలం మీదుగా కోహెడలోకి ప్రవేశించినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఇదే పులి శనివారం మద్దూరు మండలం లద్నూర్, అమ్మాపూర్ గ్రామాల్లో లేగదూడలపై దాడి చేసింది. తాజా దాడి విషయం తెలుసుకున్న హుస్నాబాద్ ఎఫ్ఆర్‌వో సిద్ధార్థ్ రెడ్డి నంగునూరులో ఘటనా స్థలాన్ని చేరుకొని పరిసర ప్రాంతాల్లో పులి సంచరించిన పాదముద్రలను ధృవీకరించారు. ప్రస్తుతం అటవీశాఖ బృందాలు డ్రోన్ల సాయంతో పులి కోసం గాలిస్తున్నాయి. పశువులను వ్యవసాయ బావుల వద్ద కాకుండా ఇంటి వద్ద కట్టేసుకోని జాగ్రత్తగా ఉండాలని కోహెడ మండల ప్రజలకు పోలీసులు తెలియజేశారు. రైతులు ఒంటరిగా బావుల వద్దకు వెళ్లవద్దని చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చిగురుమామిడి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోహెడ మండలంలో పెద్దపులి సంచారం వార్త చిగురుమామిడి మండలం గ్రామాలను వణికించేస్తోంది. కొద్దిరోజుల క్రితం సిద్దిపేట ప్రాంతం నుంచి జనగాం వైపు వెళ్లిన పెద్దపులి, మళ్లీ అదే మార్గంలో వెనుతిరిగి ప్రస్తుతం కోహెడ సమీప అటవీ ప్రాంతంలో తిష్టవేసినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. పులి కదలికలు చిగురుమామిడి మండల సరిహద్దులకు చేరువలో ఉండటంతో యంత్రాంగం అప్రమత్తమైంది. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు రానున్న రెండు రోజుల పాటు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు.ముఖ్యంగా రైతులు పొలాల వద్దకు వెళ్లేటప్పుడు, పశువుల కాపరులు అడవి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని అటవీ శాఖ సూచిస్తోంది. గ్రామాల్లో రాత్రి వేళల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అటవీ శాఖ అధికారులు ఇచ్చే సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరుతున్నారు. ఎక్కడైనా పులి అడుగుజాడలు కనిపించినా, పశువులపై దాడి జరిగినట్లు గమనించినా ఏమాత్రం ఆలస్యం చేయకుండా అటవీ శాఖ సెల్ నెంబర్ 92477 40525 కు వెంటనే సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు భయాందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండి అధికారులకు సహకరించాలని కోరారు.

రూ. 7 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

- 1,253 గజాల పార్కు చుట్టూ హైడ్రా ఫెన్సింగ్

ప్రతి పక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 8: సంగారెడ్డి జిల్లా, అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చక్రపురి కాలనీలో ఉన్న 1,253.8 గజాల పార్క్ స్థలాన్ని హైడ్రా ఆదివారం కాపాడింది. దీని విలువ రూ. 7 కోట్ల విలువ ఉంటుందని అంచనా. చక్రపురి కాలనీ సంక్షేమ సంఘం పార్కు ఆక్రమణలకు గురవుతోందని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. సర్వే నంబర్ 135, అమీన్పూర్ గ్రామంలో ఉన్న ఈ పార్క్ భూమి మొత్తం 1253.8 చదరపు గజాలు విస్తీర్ణంలో ఉంది. ఈ భూమిని గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ నెం. 12343/2022 ప్రకారం, స్థానిక సంస్థలకు ప్రజా వినియోగం కోసం లేఔట్ వేసిన వారు అప్పగించారు. ఈ స్థలాన్ని హుడా లేఅవుట్ అనుమతి ప్రకారం పార్క్, రోడ్ల అభివృద్ధికి కేటాయించారు. పార్కు కోసం కేటాయించిన స్థలం సరిహద్దు రాళ్లు తొలగించినట్టు గుర్తించారు. ఈ మేరకు హైడ్రా ఆదివారం చర్యలు తీసుకుంది. పార్కు చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. పార్కును కాపాడిన హైడ్రాకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీతోనే మున్సిపాలిటీల అభివృద్ధి సాధ్యం

- ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎండీ ఫహీమ్

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎండి ఫహీమ్ పిలుపునిచ్చారు. మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఆయన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్ హాజరై మాట్లాడారు. పట్టణ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరింత అందాలంటే అధికార పార్టీకి ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయలేదని విమర్శించారు. మతం పేరుతో బీజేపీ రాజకీయం చేస్తుందని మండిపడ్డారు. ఈ నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి గౌరీ సతీష్ టీపీసీసీ సభ్యులు చాలా దర్శన్ మండల అధ్యక్షులు మానేయ మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి, నాగిరెడ్డి గూడా సర్పంచ్ సంజీవరెడ్డి, చందనగర్ సర్పంచ్ మురళి , మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, నాయకులు సత్యనారాయణ, మహేందర్ రెడ్డి , బాలరాజ్, కృష్ణారెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ కేసీఆర్ జాతిపితనే!

- కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దు
- బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 8: మొయినాబాద్ మున్సిపాలిటీ పెద్ద మంగళారం, చిలుకూరు, అప్పోజిగూడ, హిమాయత్ నగర్, మొయినాబాద్ పరిధిలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా చేసుకుని మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో ఆమె ఇంటింటి ప్రచారం, రోడ్ షో నిర్వహిస్తూ ప్రజలతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎవరిని అడిగినా మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆమె తెలిపారు. రైతు బంధు, ఇంటింటికి తాగునీరు, అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పేదల పెద్ద కొడుకులా పింఛన్లను రూ.200 నుంచి రూ.2,000కు పెంచిన విషయాన్ని కూడా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ పాలన స్వర్ణయుగంలా సాగిందని, ఆ పాలనలో ప్రజలకు భద్రత ఉండేదని ఆమె వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రజాపాలన రాష్ట్రానికి శాపంగా మారిందని విమర్శించారు. ఈ రాష్ట్రానికి కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని అన్నారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అమర్ లాల్ చౌహాన్, యువ నాయకులు ముఠా జయసింహ, ఆంజనేయులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలి

- భాజపా అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి
- బీజేపీ రాజ్యసభ సభ్యులు కె .లక్ష్మణ్

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 8 : భాజపా పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని రాజ్యసభ సభ్యులు కె .లక్ష్మణ్ అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ప్రజలను మభ్యపెట్టి కళ్యాణ లక్ష్మికి లక్ష రూపాయలతో పాటు తుల బంగారం, పింఛన్లు 2 వేల నుండి 4 వేలు, మహిళలకు రూ.2,500, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ తదితర హామీలను ఇచ్చి వాటన్నింటినీ తుంగలో తొక్కిందని, అలాంటి కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అదేవిధంగా టిఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలే బీజేపీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, శేఖర్ యాదవ్, నారాయణ రెడ్డి, సిద్ధు, వెంకటేష్ గౌడ్, రాజు గౌడ్ తదితరులు ఉన్నారు.

“



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమయంలో తాము ప్రశ్నించినందుకే అజహరుద్దీన్‌కు సీఎం రేవంత్ మంత్రి పదవి ఇచ్చారు. కేసీఆర్ ఫొటోకు అజహరుద్దీన్ దండం పెట్టాలి. ఆయనకు మంత్రి పదవి వచ్చి 3 నెలలైనా ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేదు, ఇంకో 3 నెలల్లో ఇవ్వకపోతే మినిస్టర్ పదవి పోతుంది. తనకు వంద నోటీసులు ఇచ్చినా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆపను.

- మాజీ మంత్రి హరీశ్ రావు

సమీక్ష

తెలంగాణ సినీ చరిత్ర: మూలాలు పరిణామాలు

తంగెళ్ల శ్రీదేవి రెడ్డి
8555-895827

విజ్ఞానాన్ని వినోదాన్ని హృదయ రంజకంగా అందించే ఏకైక సాధనం సినిమా! ఈ క్రమంలో తెలంగాణ సినిమా అంటే కేవలం ఒక ప్రాంతీయ సినిమా మాత్రమే కాదు, అది ఒక సంస్కృతిక పోరాట ప్రతిబింబం! అస్తిత్వ చేతన! సినిమా అంటే రంగుల ప్రపంచం మాత్రమే కాదు, రంగుల హంగులతో ఒక సమాజపు మనుగడలో కీలక పాత్ర వహించే సామాజిక, రాజకీయ పరిణామాలను సమగ్రంగా చూపెట్టగలిగే దర్పణం. తెలంగాణ గడ్డపై సినిమా వేసిన తొలి అడుగుల నుంచి నేటి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు వరకు సాగిన ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమైనది.

భారతీయ సినిమా చరిత్రలో తెలంగాణ సినీ పరిశ్రమ ఆవిర్భావం, పయనం, ఒడిదుడుకులు, ఈ మొత్తం నేపథ్యంలో ఈ పుస్తకం వేదికగా రచయిత తొమ్మిది విభాగాలుగా చర్చించడం జరిగింది.

1.సినిమా ఆవిర్భావం
2. భారతదేశంలో సినిమారంగం
3. తెలంగాణ సినీ ప్రస్థానం
4. తెలంగాణ సినీ తేజోమూర్తులు
5.తెలంగాణ దర్శక నిర్మాతలు
6.తెలంగాణ ప్రముఖ నటి నటులు
7. తెలంగాణ సినీ గేయ రచయితలు, సంగీత దర్శకులు.
8. సినిమాలు తెలంగాణకు ప్రతిబింబాలు
9. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులు

ప్రపంచ వేదికపై సినిమా తొలినాళ్ళు

సినిమా ఆవిర్భావం గురించి రచయిత పొన్నం రవిచంద్ర అనే చారిత్రక అంశాలను ప్రస్తావించాడు.

1895 డిసెంబర్లో ప్యారిస్ లో సినీ చరిత్రకు అంకురార్పణ జరిగింది. తరువాత 1896 జులైలో భారతీయ నేలమీద సినిమా అడుగుపెడుతూ లూమియర్ బ్రదర్స్ ద్వారా బొంబాయి వాట్సన్ హోటల్లో ఆరు చిత్రాలు ప్రదర్శించబడ్డాయి.. ప్రపంచ సినిమా ఆవిర్భావ మొదటి దశలో మూకీ కదిలే బొమ్మలు ప్రేక్షకులను రంజింప చేసినప్పటికి అవి సెకండ్ల నిడివిలో ఉన్న డాక్యుమెంటేషన్స్.ఈ చిత్రాల ప్రదర్శన తర్వాత, భారతదేశంలో సినిమా ఆవిర్భావానికి నాంది పలికింది. వాట్సన్ హోటల్లో సినిమా ప్రదర్శన తరువాత,1896 జులై నుండే బొంబాయి నావెల్టీ థియేటర్లో సినిమాల ప్రదర్శన నిత్యకృత్యంగా మొదలైంది. ఆ తర్వాత కోల్కతా, మద్రాస్ వంటి నగరాలకు విస్తరించింది. ఈ ప్రభావంతో H.S. భాట్వదేకర్ ప్రేరణ పొంది, 1899లో 'ది రెస్ట్ లర్స్ ' పేరుతో మొదటి భారతీయ చలన చిత్రాన్ని నిర్మించడం జరిగింది.ఈ విధంగా భారతదేశంలో సినిమాకు శతాధిక చరిత్ర ఉన్నది. ఆర్.జి.టోర్నీ అని పిలవబడే రామచంద్ర గోపాల్ టోర్నీ అనే హిందీ మరాఠీ దర్శకుడు 1912 లో "పుండరీక " పేరుతో ఒక సినీ ఫీచర్ రూపొందించాడు.తర్వాత 1913లో దాదా సాహెబ్ ఫాల్కే దేశంలో మొదటి సినిమాగా "రాజా హరిశ్చంద్ర "చిత్రాన్ని మూకీ నిర్మించాడు. ఈ ప్రభావంతో 1913 తర్వాత హైదరాబాద్ వేదికగా సినిమా ప్రదర్శనలు ప్రారంభం అయినప్పటికీ ఆ చరిత్ర రికార్డ్ కాలేదు అని విమర్శకుడుగా డా. పొన్నం రవిచంద్ర అభిప్రాయ పడుతున్నారు.ఈ క్రమంలో హైదరాబాద్ సినిమా ప్రాచీన వైభవాన్ని ఒక వేదికను ఏర్పరచుకొని సమగ్రంగా సమకూర్చి తెలంగాణ సమాజానికి అందివ్వాలనే తొలి ప్రయత్నమే "తెలంగాణ సినీ ప్రస్థానం"

భారతీయ సినిమా - ప్రస్తావన

రచయిత భారతదేశంలో సినిమారంగం గురించి అనేక అంశాలను పరిశోధనా క్రమంలో వెండితెర స్వప్నికుల గురించి చర్చించడం జరిగింది.ఈ క్రమంలో భారతీయ సినిమా ప్రస్తావనలో మొదటి ప్రాధాన్యత ఉన్న వెండితెర ఇలవేల్పు దాదాసాహెబ్ ఫాల్కే, రెండవ ప్రాధాన్యత వున్న వెండితెర ఆణిముత్యం కోల్కతా కేంద్రంగా సినిమాలు నిర్మించిన హీరాలాల్ సేన్, మూడో ప్రాధాన్యత ఉన్న వెండితెర శిఖరం చెన్నై కేంద్రంగా సినిమాలు నిర్మించిన నటరాజ మొదలియార్, వీరితో పాటుగా హైదరాబాద్ కేంద్రంగా తొలితరం సినిమాలకు ప్రాణంపోసిన సృజనశీలి ధీరేంద్రనాథ్ గంగూలీ గారిని స్మరించుకోవడం జరిగింది. రచయిత ఇతడిని భారతీయ సినిమాకు కనిపించని నాలుగో పునాది పేర్కొన్నాడు. ధీరేన్ గంగూలీ చొరవ కారణంగానే మూకీతో మొదలై అనతి కాలంలోనే సినిమాల పంపిణీ, ప్రదర్శనకు బలమైన కేంద్రంగా హైదరాబాద్ రూపొందిందినట్టుగా రవిచంద్ర చెప్పుకువచ్చాడు..

భారతీయ తొలి టాకి

1927 లో హాలీవుడ్ లో 'జాజ్ సింగర్' టాకీ వచ్చింది. ఇది ప్రపంచ వ్యాప్త ప్రభావం చూపిస్తూ 1930 నాటికి భారతీయ సినిమా పరిశ్రమలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. నాటక రచయిత జోసెఫ్ డేవిడ్ రాసిన "ఆలం ఆరా" నాటకాన్ని సినిమాగా రూపొందించి 1931 వ సంవత్సరం మార్చి 14 వ తేదీన మెజెస్టిక్ థియేటర్ లో ప్రదర్శించారు. ఈ విధంగా "ఆలం ఆరా'' తొలి భారతీయ టాకీ సినిమాగా చరిత్రలో స్థానం సంపాదించుకుంది.

తెలుగు సినిమా - ప్రస్తావన

1932 నాటికి భారతదేశంలో మూగ చిత్రాల కాలానికి కాలం చెల్లిపోయింది.. టాకీల నిర్మాణంపై దర్శక నిర్మాతలు దృష్టి సారించారు. కానీ హైదరాబాదులో మాత్రం అలాంటి ప్రయత్నాలేవీ మొదలు కాలేదని రచయిత పొన్నం రవిచంద్ర పేర్కొన్నాడు.ఈ విషయం గురించి వివరణ అందిస్తూ.. "మూకీల కాలంలో మొత్తం 20 మూకీలు హైదరాబాదులో తయారయ్యాయి. మద్రాసుతో సమాంతరంగా హైదరాబాదులో ఈ మూకీల నిర్మాణం జరిగినా, మద్రాసు పాలనలో ఉన్న ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడ ఎవరూ మూకీలు తీయలేదు. తమిళనాట తెలుగు వారు తీసిన మూకీలు తెలుగు సినిమా చరిత్రకు తొలి రోజులైతే, హైదరాబాదు మూకీల నిర్మాణ కాలం తెలంగాణ సినిమా చరిత్రకు మూలంగా పరిగణించాలి." అన్నాడు. 'క్రోనో మెగాఫోన్ పరికరంతో 1909లో మద్రాసు విక్టోరియా పబ్లిక్ హాల్లో తొలి ప్రదర్శన ఏర్పాటు చేసి 3 నిమిషాల మూకీ సినిమాలు ప్రదర్శించిన రఘుపతి వెంకయ్యనాయుడు గారిని తెలుగు సినీ రంగానికి ఆద్యుడిగా తెలుగు చలనచిత్ర రంగానికి పితామహుడుగా పేర్కొనడం గురించి రచయిత ప్రస్తావన చేసాడు.తర్వాత 1933లో తొలి తెలుగు టాకీ సినిమా " భక్త ప్రహ్లాద"రూపొందించిన హెచ్.ఎం రెడ్డి గారిని తొలి టాకీ సృష్టికర్తగా ప్రస్తావించాడు.

తెలంగాణ సినిమా

భారతీయ చలనచిత్ర రంగంలో తెలంగాణ నిర్వహించిన పాత్ర కీలకమైనది. 1896 లోనే మూకీ సినిమాల ప్రదర్శనకు హైదరాబాదు నగరం వేదిక అయింది. మూకీ సినిమాలు జనాల్ని అలరిస్తున్న సమయంలో బొంబాయి, మద్రాసు నగరాలతో సమాంతరంగా హైదరాబాదుకు చరిత్ర ఉన్నదనే ప్రస్తావన తెస్తూ... "ఈ మూకీ చరిత్రకు 1908లో సంభవించిన భయంకరమైన వరదలు కూడా హైదరాబాదు సైలెంట్ సినిమాల చరిత్రలో ఒక భాగంగా కనిపించడం ఒక ప్రత్యేకత. రఘుపతి వెంకయ్య 1910లో తొలిసారి మూకీ సినిమాలు ప్రదర్శిస్తే, అంతకు రెండేళ్ల మునుపే అంటే 1908లోనే ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ నగరాలలో "బాబు పి.ఎస్' అనే ఒక సంచార సినీ ప్రదర్శకుడు మూకీ సినిమాలను తన బయోస్కోప్ ఫిలిం కంపెనీ ద్వారా ప్రదర్శించారు" అని రచయిత రవిచంద్ర తెలంగాణ సినీ చరిత్రలో నిజాల్ని వివరించి చెప్పాడు. ఈ సందర్భంగా తెలంగాణ గుండెకాయ హైదరాబాద్ వేదికగా జరిగిన చిత్ర ప్రదర్శనల గురించిన చారిత్రక సమాచారం అందించాడు.

1)1896 జూలైలో బొంబాయిలో మొదటిసారిగా లూమియర్ బ్రదర్స్ భారతీయులకు సినిమాను పరిచయం చేయగా,. బెంగళూరు, కలకత్తా నగరాలలో సైలెంట్ సినిమాలను ప్రదర్శించిన తొలి విదేశీయుడు ప్రొఫెసర్ టి. స్టీవెన్సన్ 1897 ఆగస్టులో హైదరాబాద్ జంటనగరాలలో మొదటి సారిగా మూకీ చిత్రాలను ప్రదర్శించాడు.

2)తొలి మూవీ కెమెరా కలకత్తా నుండి హైదరాబాద్ కు 1910లో వచ్చింది.

తెలంగాణ తొలితరం నటీనటులు - టెక్నీషియన్లు

1)మూకీల కాలం నడుస్తున్నప్పుడు 1925లో హైదరాబాదు నుండి బొంబాయికి వెళ్ళిమూకీ సినిమాలలో నటించిన తొలితరం నటీమణులలో అక్కాచెల్లెళ్ళు మృణాళిని దేవి, సునాళిని దేవి, ఉన్నారు..

2)1927లో హైదరాబాద్ పాతబస్తీ నాగుల చింత ప్రాంతంనుండి బొంబాయికి వెళ్లి సినిమాల్లో నటించడం మొదలు పెట్టిన వాళ్ళల్లో 'రాంప్యారి ' ఒకరు. ఈమె నర్తకి.'తొలి కథానాయికలలో ఆమె ఒకరు. 1927లో చందూలాల్ షా కంపెనీ తీసిన 'గుణసుందరి'లో ఆమె తొలిసారిగా నటించింది.

3) హైదరాబాద్ స్టేట్ నుండి 1928 లో బొంబాయి వెళ్ళిన వారిలో పైడి జైరాజ్ ఒకరు. వీరు 12 మూకీ సినిమాలు, దాదాపు మూడు వందల టాకీ చిత్రాలలో నటించి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్నారు.

4)సినిమాటోగ్రాఫర్ మహమ్మద్ అబ్దుల్ రెహ్మాన్ తెలంగాణ ప్రాంతం నుండి బొంబాయికి వెళ్లి నాడియా వారి వాడియా కంపెనీలో చేరి కెమెరామెన్గా సైలెంట్ చిత్రాలకు పనిచేశాడు.

5) పైడి జైరాజ్ స్ఫూర్తితో కరీంనగర్ ప్రాంతానికి చెందిన 'మహమ్మద్ బేగ్' 1928లో బొంబాయి వెళ్లి నిర్మాతగా సినిమా రంగంలోకి అడుగు పెట్టాడు. ఉత్తరప్రదేశ్ లక్నో వెళ్ళి ప్రసిద్ధ సినీ టెక్నీషియన్ కృష్ణగోపాల్ తో కలిసి 1929లో 'యునైటెడ్ పిక్చర్స్ కార్పొరేషన్ (ఇండియా) లిమిటెడ్' పేరున ఒక సినీ నిర్మాణ సంస్థను నెలకొల్పాడు.

ఈ వివరాలతో పాటుగా థియేటర్ వ్యవస్థ, సినిమా వ్యాపార సంస్థలు,జంట నగరాలలో తొలినాళ్ల సినిమా టాకీసులు,నిషేధానికి గురైన సినిమాలు, సినిమా చట్టాలు ,వినోదపు పన్ను ప్రవేశపెట్టిన నిజాం సర్కారు,హైదరాబాద్ తొలి డిస్ట్రిబ్యూటర్ అలీబాకర్, హైదరాబాదులో ఆఖరి మూకీ చిత్ర నిర్మాణ సంస్థ, వంటి వివరాలతో పాటుగా 1935లో హైదరాబాద్ ఇంపీరియల్ సినిమా థియేటర్లో స్వయంగా సినిమా చూసిన నిజాం ప్రభువు గురించి, నిజాం సర్కారు పైడి జయరాజును స్వయంగా పిలిపించి సన్మానించిన సందర్భంగా గురించి రచయిత వివరాలు అందివ్వడం జరిగింది.

తెలంగాణలో సినీ పరిశ్రమ

మద్రాస్ లో ఉన్న తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్ కు తరలి రావడం...ఇందుకు మర్రి చెన్నారెడ్డి కృషి, హైదరాబాదులో సినిమా స్టూడియోలు, తదితర విషయాల గురించి కూడా రచయిత చర్చించాడు. 1956లో హైదరాబాద్లో సారథి స్టుడియో నిర్మించబడింది. ఇది హైదరాబాదులో నిర్మించిన తొలి స్టుడియో. తర్వాత 1975లో అక్కినేని నాగేశ్వరరావు అన్నపూర్ణ స్టూడియోస్, 1976లో ఎన్. టి. రామారావు రామకృష్ణ స్టూడియోస్ & థియేటర్, 1984లో కృష్ణ పద్మాలయా స్టూడియో, 1989లో దగ్గుబాటి రామానాయుడు రామానాయుడు స్టూడియో, 1996లో రామోజీరావు రామోజీ ఫిల్మ్ సిటీ, 2022లో అల్లు స్టూడియోస్ వంటివి నిర్మించి, ఇతర నటులను...నిర్మాతలను... టెక్నీషియన్లను ప్రోత్సహించారు.

తొలి తెలంగాణ సినిమా

కవిత్వం, సాహిత్యం, కళలు వంటి సృజనాత్మక రంగాల్లో తెలంగాణ అస్తిత్వానికి ప్రత్యేక గుర్తింపు ఉన్నట్టుగానే, సినిమా రంగంలో కూడా తెలంగాణ ఆత్మ ఆవిష్కరించబడిందని రవిచంద్ర పేర్కొన్నారు. ఈ క్రమంలో 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమకాలం తరువాత , 1977లో మాధవరావు దర్శకత్వంలో వరంగల్ జిల్లా ఆత్మకూరు గడీ నేపథ్యంగా తెరకెక్కిన "చిల్లరదేవుళ్ళు" సినిమాను తొలి తెలంగాణ సినిమాగా రచయిత నిర్ధారించాడు . దాశరథి రంగాచార్య 1969లో రాసిన నవల ఆధారంగా రూపొందిన ఈ సినిమా తెలంగాణ భాష, యాసలతోనే కాక, తెలంగాణ ప్రజల గోసను చూపెట్టింది.ఆ తర్వాత 1979లో వచ్చిన 'మా భూమి' తెలంగాణ సినిమా గ్రామ గ్రామాన ఒక సంచలనం సృష్టించింది. 1947 నాటి తెలంగాణలోని ఫ్యూడల్ విధానాన్ని, పోలీస్ యాక్షన్ అనంతరం రైతుల పరిస్థితిని ఎంతో వాస్తవికంగా, మరెంతో హృదయవిదారకంగా ఈ సినిమా చూపెట్టింది. ఈ సందర్భంగా ''సినిమా కళ ప్రజల కోసమే అనీ, సామాజిక ప్రయోజనమే సినిమా కళ ఆశయం అని, మాభూమి సినిమా ఇదే నిరూపించిందని రచయిత స్పష్టం చేశారు. తెలంగాణ నేపథ్యంలో వచ్చిన మల్లేశం, బలగం,వంటి సినిమాలను కూడా రచయిత ఇక్కడ పరిచయం చేసాడు..

తెలంగాణ వెండితెర వెలుగులు

తొలి టాకీ సినిమా భక్త ప్రహ్లాద కు పాటలు రచించి, తొలి సినిమా పాటల రచయితగా చరిత్ర సొంతం చేసుకున్న చందాల కేశవదాస్ గురించిన వివరాలను రచయిత స్పష్టంగా పరిచయం చేశాడు. అట్లాగే బాలీవుడ్ విలన్ గా తనకంటూ ఒక ముద్ర వేసుకున్న హైదరాబాది యువకుడు అజిత్ ఖాన్ పరిచయం, తెలంగాణ సినిమాకు తొలి తరం మార్గదర్శి బి ఎస్ నారాయణ పరిచయం సమగ్రంగా ఉన్నాయి. ఇదే వరుసలో జానపద పౌరాణిక సినిమాల కథానాయకుడుగా అలరించిన కత్తి కాంతారావు జీవితం సినిమా వివరాలు, విలక్షణ నటుడిగా మానవతా వాదిగా దానశీలిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ మందాడి ప్రభాకర్ రెడ్డి జీవితం సినిమా వివరాలు, తెలంగాణ సినిమాకు అంతర్జాతీయ ఖ్యాతిని అర్జించిపెట్టిన బి నర్సింగ్ రావు జీవితం సినిమా వివరాలు, కథానాయకులతో పోటీపడి నటించి మెప్పించిన విజయశాంతి వివరాలు, ఒకనాటి కథానాయకి మాధవి వివరాలు, హైదరాబాద్లో పుట్టి ముంబైలో పెరిగి బాలీవుడ్లో స్థిరపడిన టబు వివరాలు, తెలంగాణ వెండితెర వెలుగులుగా రచయిత పరిచయం చేస్తూ వచ్చాడు. తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన ప్రతి ఒక్క వెండి తెర వెలుగు గురించి రచయిత పరిచయం వారి శ్రమను తెలియజేస్తున్నది. తెలంగాణ దర్శక నిర్మాతలు, నటులు, తెలంగాణ సినీ గేయ రచయితలు, గాయకులు, అందరి వివరాలతో కూడిన ఈ పుస్తకం తెలంగాణ సినిమా ప్రస్థానానికి సంబంధించినంత వరకు ఒక దిక్సూచిగా ఉపకరిస్తుంది అనేది వాస్తవం.

గద్దర్ అవార్డులు

తెలుగు చలనచిత్ర పరిశ్రమను పురోత్సహించే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గద్దర్ అవార్డులు అత్యంత ప్రతిష్టాత్మకమైనవి. గద్దర్ అవార్డుల జ్ఞాపికను గుంటూరు జిల్లాకు చెందిన రమావత్ నాయక్ రూపొందించడం విశేషం.అవార్డుల గురించిన రచయిత పుస్తకంలో పొందుపరిచారు. తెలంగాణ సినీ ప్రస్థానం" కేవలం ఒక ప్రాంతపు చలనచిత్ర చరిత్ర మాత్రమే కాదు; అది ఒక సమాజం తన అస్తిత్వం కోసం, ఆత్మగౌరవం కోసం వెండితెరపై సాగించిన పోరాట పరిణామ క్రమం. మూకీల కాలం నాటి ఆదిమ ఆనవాళ్ల నుంచి, నిజాం కాలపు సాంస్కృతిక వైభవం మీదుగా, నేటి గ్లోబల్ సినిమా వేదికలపై 'బలగం' వంటి మట్టి వాసన గల చిత్రాల వరకు సాగిన ప్రయాణాన్ని డా. పొన్నం రవిచంద్ర ఈ పుస్తకంలో అక్షరబద్ధం చేశారు. సినిమా అంటే కేవలం గ్లామర్ కాదు, అది ఒక జనజీవన చిత్రపటమని ఈ గ్రంథం నిరూపిస్తుంది. పైడి జైరాజ్ వంటి దిగ్గజాల నుంచి, గద్దర్ ప్రజా కళల వరకు తెలంగాణ సినీ రంగం భారతీయ సినిమాకు అందించిన తోడ్పాటును ఈ పుస్తకం వెలుగులోకి తెచ్చింది. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ సినిమా తనదైన స్వరాన్ని, భాషను, కథలను ఎలా పండించుకుంటుందో చెప్పడానికి ఈ పరిశోధనాత్మక గ్రంథం ఒక సాక్ష్యంగా నిలుస్తుంది.

భవిష్యత్ తరాల సినీ ప్రేమికులకు, పరిశోధకులకు, తెలంగాణ సంస్కృతిని ప్రేమించే ప్రతి ఒక్కరికీ ఈ పుస్తకం ఒక విలువైన కరదీపిక. సినిమా మాధ్యమం ద్వారా సామాజిక మార్పును ఆశించే వారికి, ఈ 'ప్రస్థానం' ఎంతో స్ఫూర్తినిస్తుంది.

(సమీక్షకులు రచయిత్రి)





తెలంగాణ సినీ ప్రస్థానం
రచయిత: డా. పొన్నం రవిచంద్ర

తెలంగాణ ప్రతిబింబాలుగా మిగిలిన సినిమాలు

చివరకు మిగిలేది	1960
అంకుర్	1974
వేములవాడ భీమకవి	1976
ఊరుమ్మడి బతుకులు, చిల్లర దేవుళ్ళు, ఒక ఊరి కథ	1977
మాభూమి	1980
అనుగ్రహం	1988
రంగులకల, మండి,విముక్తి కోసం	1983
దాసి	1988
మట్టిమనుషులు	1990
ఎర్ర సైన్యం	1994
ఒసేయ్ రాములమ్మ	1997
ఎన్ కౌంటర్	1997
హైదరాబాద్ బ్లూస్	1998
తెలంగాణ	1999
సమ్మక్క సారక్క	2000
కుబుసం	2002
మార్గదర్శి	2003
అంగ్రేజ్	2005
బతుకమ్మ	2008
కొమరంభీమ్	2010
వీర తెలంగాణ	2010
రాజన్న, జైబోలో తెలంగాణ	2011
రుద్రమదేవి	2015
ఫిదా	2017
దొరసాని, మల్లేశం	2019
విరాట పర్వం	2022
దసరా, బలగం, రుద్రంగి	2023
షరతులు వర్తిస్తాయి, ఇంకెన్నాళ్ళు	2024
రాజు వెడ్స్ రాంబాయి	2025

సినిమాలను రచయిత తెలంగాణ ప్రతిబింబాలుగా చాటి చెప్పాడు. ఈ మొత్తం సినిమాలు, దర్శక నిర్మాతల ప్రాంతాలు, ఇతివృత్తం, నటులు,ఈ వివరాలు కూలంకషంగా అందించిన రచయిత పరిశోధనా దృష్టి అభినందనీయం.

కవిత

ఓటరూ నువ్వే ఘాటరూ..

గురిపెట్టు నీ ఆయుధాన్ని
ఒడిసి పట్టు ప్రజాస్వామ్యాన్ని
నువ్వే ధర్మానివి నువ్వే న్యాయానివి
మత్తుకు లొంగకు విత్తుకు వంగకు
నిఖార్సుగా నిలబడు నిలబడు
నిటారుగా కనబడు కనబడు
నిజాయితితో కలబడు కలబడు
వడి వడిగా పరుగిడు పరుగిడు

ఓటరువై తలబడు తలబడు
ఘటరువై ఎదురిడు ఎదురిడు

పన్నీరుకు తడవకు తడవకు
కన్నీరును మరవకు మరవకు
భయాల మోతకు జడవకు జడవకు
మోసపు కూతకు మురవకు మురవకు
అసత్యం వైపుకు నిలవకు నిలవకు

చీటరు ఎవరో ఓటరు కెరుక
ఓటరు బలము చరిత్ర కెరుక
జనం జనంగా ప్రభంజనంగా..
కదంతొక్కుతూ కదిలిపోవయా..

ప్రలోభాలకు కదలకు కదలకు
ప్రణామాలకు మెదలకు మెదలకు
లక్ష్యం వైపే గురి నిలవాలి
సత్యం వైపే పురి కుదరాలి
ప్రజాభిమానపు సిరి వుండాలి

నాయకుడంటే మది నిండాలి
వెరవని మనసుతో హృది పండాలి

పనిమంతుడికే పట్టం పట్టం
గుణవంతుడెలే చుట్టం చుట్టం
ఓటునోటుకు జారకు జారకు
ఓటరు ఓటరూ నువ్వే ఘాటరు..!

(11న పుర పోరు సందర్భంగా)

డా.కటుకోర్భ్వుల రమేష్
9949083327

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

సదాశివపేటలో జయమ్మ.. సంగారెడ్డి లో నిర్మలమ్మ

- **కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్న తల్లీ కూతుళ్ళు**
- **8 కోట్ల తో ఒక్కో వార్డులో అభివృద్ధి, పేదలకు ఇంటి స్థలాల హామీ తో ప్రచారం లో దూసుకుపోతున్న కాంగ్రెస్**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 8: మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి రెండు రోజుల్లో తెర పడనుండటం తో కాంగ్రెస్ పార్టీ ప్రచారం లో దూకుడు పెంచింది. సంగారెడ్డి లో శనివారం జరిగిన ప్రజలతో జగ్గారెడ్డి ముఖాముఖి సభ విియవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. ఆదివారం ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. సదాశివపేట లో జయా చైతన్య రెడ్డి, సంగారెడ్డి లో నిర్మలా జగ్గారెడ్డి ఇంటిటి ప్రచారం లో పాల్గొన్నారు. టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థుల తరపున పట్టణం లో ని 11,31,32,33,6 వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రతీ వార్డులో 8 కోట్ల రూపాయల తో అభివృద్ధి చేయడం తో పాటు వార్డులో ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇప్పిస్తామన్నారు. మీ మనస్సు మాట వినండి, కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటేయాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. మరోపక్క సదాశివపేట మున్సిపాలిటీ లో జయా చైతన్య రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. 17,18,4,8 వార్డులతో పాటు పలు వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయారెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట మీద నిలబడే వ్యక్తి జగ్గారెడ్డి అని, ఆయన మాట ఇస్తే చేసి తీరుతారని అన్నారు. సదాశివపేట లో సర్టిఫికెట్లు ఉన్న 5500 మందికి తో పాటు ఇల్లు లేని ప్రతీ పేదలకు ఇంటి స్థలాలు జగ్గారెడ్డి ఇచ్చి తీరుతారాన్నరు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రతీ వార్డులో 8 కోట్ల రూపాయల తో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో ఆయా వార్డుల అభ్యర్థులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్ రెడ్డి పాల్గొన్నారు.

కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ లో కాంగ్రెస్ హోరు

- **ఎన్నికల ప్రచారంలో మంత్రులు తుమ్మల, పొన్నం**

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ /సిరిసిల్ల/వేములవాడ, ఫిబ్రవరి8: కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో నిర్వహించిన భాగంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా చోట్ల నిర్వహించిన వేర్వేరు ప్రచార కార్యక్రమాలలో మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్ తో పాటు సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని మంత్రులు కోరారు. నేతన్నలకు బడుగు బలహీన వర్గాల కు చెందిన వారికి న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సిరిసిల్ల మున్సిపాలిటీ లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం లో అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం.. కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండిని పిలుపు నిచ్చారు. సిరిసిల్ల మున్సిపాలిటీ లో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కేకే మహేందర్ రెడ్డి, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఇంద్రేశం మున్సిపాలిటీ అభివృద్ధి మా బాధ్యత

- **మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్, కాట శ్రీనివాస్ గౌడ్**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ స్థానిక ఎన్నికల్లో గెలిస్తేనే అభివృద్ధి సాధ్య పడుతుందని కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపిస్తే మీ అభివృద్ధి బాధ్యత మాదంటూ మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు, పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో ఇరువురు నేతలు ఆయా వార్డు కాంగ్రెస్ అభ్యర్థులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తూ ప్రతి ఇంటికి సంక్షేమం ప్రతి వాడకు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తుందన్నారు. నూతనంగా ఏర్పడిన ఇంద్రేశం మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న 15 కోట్ల ప్రత్యేక నిధులతో ఈ ప్రాంతానికి అవసరమైన మౌళిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పటాన్ చెరు నుంచి ఇంద్రేశం వచ్చే ప్రధాన రహదారిని విస్తరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఇప్పటికే జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి తో మాట్లాడి నిధుల మంజూరు విషయంలో హామీ తీసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి ఓటు వేస్తే అభివృద్ధి సాధ్యపడుతుందని ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి చేయి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమం లో ఇంద్రేశం పీసీసీ ఇంచార్జ్ పారిజాత నరసింహా రెడ్డి, స్థానిక నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

65 యేండ్ల వృద్ధురాలి నేత్ర దానం

- **మరో ఇద్దరికి చూపునిచ్చిన మహిళ**

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, ఫిబ్రవరి 8: నారాయణ పేట జిల్లా నర్వ మండల పరిధిలోని పాత ర్చెడ్ గ్రామానికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలు పులుసు అమ్మక్క నేత్రదానం చేసి తన మరణానంతరం మరో ఇద్దరు వ్యక్తులకు ఈ లోకాన్ని చూసే మహత్తర అవకాశాన్ని కల్పించారు. ఆమె కుమారులు నర్సింలు, రమేష్ ల కోరిక మేరకు అమ్మక్క నేత్రాలను ఆదివారం హైదరాబాద్ కు చెందిన ఎల్వీ ప్రసాద్ ల్యాబ్ కు అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ కందుకూరి అశోక్ కుమార్ మాట్లాడుతూ నేత్రదానం చేయడంవల్ల ఇద్దరు వ్యక్తులకు ప్రపంచాన్ని చూసే అదృష్టం కల్పించినట్లయ్యిందన్నారు. కుటుంబ సభ్యులు పులుసు రమేష్, నర్సింలు లను క్లబ్ సభ్యులు, డాక్టర్ లు, గ్రామస్తులు అభినందించారు.

ఫెసిలిటేషన్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్

- **పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పరిశీలన**

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 8: ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం సందర్శించారు. ఎంత మంది పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫెసిలిటేషన్ సెంటర్ లో ఏర్పాట్లను, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఆదివారం సాయంత్రం నాటితో ముగియగా, కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్యన కౌంటింగ్ హాల్ కు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాగా, ఎన్నికల విధుల్లో నియమించబడినపోలీసు సిబ్బంది చివరి రోజైన ఆదివారం నాడు పెద్ద సంఖ్యలో ఐ.డీ.ఓ.సీ లోని ఫెసిలిటేషన్ సెంటర్ కు తరలివచ్చి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రవిబాబు, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్ తదితరులు ఉన్నారు.

రెండు సార్లు మున్సిపల్ చైర్మన్ పదవిలో ఉన్నారు

ఇందూరు పేరు మార్పు అప్పుడు గుర్తుకు రాలేదా?

- **ఎంపీ అరవింద్ పై ధర్మపురి సంజయ్ ఘాటు విమర్శలు**

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 8 : నిజామాబాద్ మున్సిపాలిటీలో బీజేపీ రెండు పర్యాయలు చైర్మన్ పదవిలో ఉన్నప్పుడు గుర్తుకు రాని ఇందూరు పేరు మార్పు ఇప్పుడు ఎందుకు గుర్తుకు వస్తుందనీ ఎంపీ అరవింద్ ను మాజీ మేయర్ ధర్మపురి ప్రశ్నించారు. ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇందూరు పేరు మార్పు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో రాజకీయంగా లబ్ధి పొందడానికేనని విమర్శించారు. తన తండ్రి ధర్మపురి శ్రీనివాస్ రాజకీయాలకు దూరం కావడంతో నిజామాబాద్ అభివృద్ధి కుంటుపడ్డదన్నారు. నగర అభివృద్ధి విషయంలో గాంధీ చౌక్ లో బహిరంగ చర్చకు సిద్ధమా అని తన తమ్ముడు ఎంపీ ధర్మపురి అరవింద్ కు సంజయ్ సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నగర అభివృద్ధి శూన్యమని, కార్పొరేటర్లు సైతం ఫోన్ చేస్తే స్పందించలేదని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో 70 శాతం ఇండ్లలో ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. రేషన్ కార్డులు అందరికీ ఇచ్చామన్నారు. మోడీ గొప్పలు చెప్పే గుజరాత్ లో కూడా సన్న బియ్యం ఇస్తలేరన్నారు. అద్దాలు పెట్టుకొని చేతులు ఊపితే రాజకీయం కాదు. ఎంపీ అరవింద్ స్మార్ట్ సిటీ ఎందుకు తేలేదని. దేవుడి పేరు చెప్పి ఓట్లు అడిగే అరవింద్ కు పనిచేసే ముఖం ఉందా అని ప్రశ్నించారు. దేవుడి పేరు చెప్పి రాజకీయాలు చేయడం తగదన్నారు. నిజామాబాద్ రోడ్ల అభివృద్ధి కోసం రూ .60 కోట్లు ఇచ్చామన్నారు. పనిచేసే వారిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ని మొన్నటి పంచాయితీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించారని, పురపాలక ఎన్నికల్లో నూ అభివృద్ధి కోసం మేయర్ పీఠం కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. నా హాయంలో అభివృద్ధి ఏం జరిగిందో ప్రజలకు తెలుసని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారడానికి బీఆర్ఎస్ పాలనే కారణమన్నారు. అందువల్లే కాంగ్రెస్ హామీల అమలులో కొంచెం వేగం తగ్గిందన్నారు. తాను వ్యక్తిగతంగా ఎవరిపైన విమర్శలు చేసేది లేదని, బిజెపి నినాదం మన ఇందూరు మన మేయర్ ను ఆయన తప్పు పట్టారు. ఏదైనా నిర్ణయం ప్రజల చేతిలోనే ఉంటుందని, ప్రజల తీర్పే శిరోధర్యమని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. తాను ఎప్పటికీ డీ.ఎస్ అడుగుజాడల్లోనే నడుస్తానని ధర్మపురి సంజయ్ స్పష్టం చేశారు.



తెలంగాణలో సౌర శక్తి విప్లవం

- **బాలాజీ సోలార్ ఎనర్జీస్‌కు 6 వార్షిక అవార్డులు**

ప్రతిపక్షం ప్రతినిధి, హన్మకొండ, ఫిబ్రవరి 8: వరంగల్ కేంద్రంగా పనిచేస్తున్న శ్రీ బాలాజీ సోలార్ ఎనర్జీస్ సంస్థ, తెలంగాణలో సౌర శక్తి రంగంలో కొనసాగుతున్న విప్లవంలో మరోసారి తన ప్రతిభను చాటుకుంది. ఈ నెల 6, 7 తేదీలలో హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించిన 'గ్లోబల్ సోలార్ ఎక్స్‌పో 2026'లో, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం 'పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' కింద అత్యుత్తమ సేవలు అందించినందుకు ఈ సంస్థకు మొత్తం 6 వార్షిక అవార్డులు లభించాయి. ఈ సందర్భంలో వరంగల్, ములుగు జిల్లాలకు డైమండ్ అవార్డులు, సిద్దిపేట జిల్లాకు ప్లాటినం అవార్డు, జనగామ జిల్లాకు గోల్డ్ అవార్డు, కరీంనగర్ , మంచిర్యాల జిల్లాలకు సిల్వర్ అవార్డులు అందించబడ్డాయి. శుక్రవారం జరిగిన వేడుకలో శ్రీ బాలాజీ సోలార్ ఎనర్జీస్ డైరెక్టర్ సాగర్ రెడ్డి, టెక్నికల్ హెడ్ ఓదెలు, ప్రతినిధులు రాజేష్ రెడ్డి, అభిలాష్, తిరుపతి తదితరులు ఈ అవార్డులను అందుకున్నారు.

హుస్నాబాద్‌లో బీజేపీకి ఒక్క ఛాన్స్ ఇవ్వండి

- **కరీంనగర్ లో విజయ సంకల్ప ర్యాలీ**
- **కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్/హుస్నాబాద్, ఫిబ్రవరి 8: మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క అవకాశమిచ్చి హుస్నాబాద్ మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని అప్పగించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుండి అధిక నిధులు తీసుకొచ్చి హుస్నాబాద్ ను అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హుస్నాబాద్ పట్టనానికి విచ్చేసిన బీజేపీ నేతలు నిర్వహించిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడారు. హుస్నాబాద్ ఎన్నికల ఇంచార్జీ కూరపాటి విజయ్, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, నియోజకవర్గ నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్న ఈ సభలో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కరీంనగర్ లో విజయ సంకల్ప ర్యాలీ

కరీంనగర్ అంతా కాషాయ మయమైంది. కాషాయ పగిడీలు ధరించి కరీంనగర్ లో వేలాది మహిళలు, పురుషులు కవాతు చేశారు. కాషాయ దళం ర్యాలీతో కలిసి అడుగులో అడుగు వేసుకుంటూ కదం తొక్కున్న ఆశీష్ షెల్లార్. బండి సంజయ్ లు పాల్గొన్నారు. కరీంనగర్ రెవిన్యూ గార్డెన్స్ నుండి ప్రారంభమైన కాషాయ ర్యాలీ పలు సర్కిల్స్ నుండి నిర్వహించారు. ర్యాలీకి పలువురు నాయకులు హాజరైనారు. కాషాయ దళం కవాతుతో కరీంనగర్ జన సంద్రమైంది.

కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టండి

- **సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి**
- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 8: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 4 కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న చేపట్టనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసి.. కార్మిక వ్యతిరేక చట్టాలను తరిమికొట్టాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయం ఆవరణలో నూతన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన సమ్మె సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక రంగానికి వెన్నుముకగా నిలుస్తున్న కార్మిక రంగానికి వెన్నుపోటు పొడుస్తూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 29 పాత కార్మిక చట్టాలను రద్దుచేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా నూతనంగా నాలుగు కార్మిక చట్టాలను తీసుకొని రావడం దుర్మార్గం అన్నారు. ప్రధానంగా పారిశ్రామిక సంబంధాల కోడ్ లోని నిబంధనల వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతింటుందని, పెద్దసంస్థల్లో కూడా ప్రభుత్వ అనుమతి లేకుండా ఉద్యోగులను తొలగించే అవకాశం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలను పెంచే అవకాశం ఉండడం వల్ల కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవితం ప్రభావితమవుతుందని తెలిపారు. వచ్చే సంవత్సరం నుండి నుంచి దేశ వ్యాప్తంగా కార్మికులపై బలవంతంగా రుద్దుతున్న లేబర్ కోడ్ లు ప్రస్తుత 29 కార్మిక చట్టాల ద్వారా పొందుతున్న కనీస హక్కులను రద్దు కాబోతున్నాయని అన్నారు. న్యాయస్థానాల ద్వారా పొందే హక్కును సైతం నూతన లేబర్ కోడ్స్ నిరాకరిస్తున్నాయని అన్నారు. పాత కార్మిక చట్టాల్లో కనీస వేతనం నిర్ణయించే అంశం కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి అంశంగా ఉందని.. నూతన లేబర్ కోడ్ లలో రాష్ట్రాల హక్కులు తొలగించడం బాధాకరమన్నారు. ఇక నుండి కేంద్రం కనీస వేతనాలు నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న వేతనాలు ఇకపై కేంద్ర ప్రభుత్వ దయా దాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసియాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడగా చెందిన పటాన్చెరు నియోజకవర్గంలో నూతన చట్టాలు కార్మికుల పాలిట ఆశనిపాతంగా మారబోతున్నాయని అన్నారు. నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టబోతున్న సార్వత్రిక సమ్మెలో ప్రతీ కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, బిఆర్టియు రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండా మనోహర్, బిఆర్టియు జిల్లా అధ్యక్షులు శివ శంకర్ రావు, సీనియర్ కార్మిక నాయకులు నరేందర్, రవి, రావు, లక్ష్మారెడ్డి, సాంబశివరావు, అశోక్, ఖాజా మొయినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రమేష్ సస్పెన్షన్‌లో కాంగ్రెస్ కుట్ర

- **2వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి గీతాంజలి**

ప్రతిపక్షం చేర్యాల, ఫిబ్రవరి 8: తన భర్త కానిస్టేబుల్ రమేష్ ను సస్పెన్షన్ ను అధికార కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా చేయించారని 2వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కమలపురం గీతాంజలి ఆరోపించారు. ఈ సస్పెన్షన్‌ను నిరసిస్తూ ఆదివారం చేర్యాల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి కుటుంబ సభ్యులు పిల్లలతో అంబేద్కర్ విగ్రహం ముందు బైఠాయించారు. ఈసందర్భగా బీఆర్ఎస్ అభ్యర్థి కమలాపురం గీతాంజలి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నా సేవలను గుర్తించి నాకు జనగామ శాసనసభ్యులు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి నాకు రెండవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ప్రకటించారని, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్న నాకు టికెట్ ఇవ్వడం అలాగే నా భర్త వృత్తి పరంగా కానిస్టేబుల్ కావడం కాంగ్రెస్ పార్టీ నాయకులు నా ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముస్త్యాల తేజ సంజీవయ్యలు జీర్ణించుకోలేకపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాయకులు అధికార బలం, ఆర్థిక బలం ఉపయోగించి మమ్మల్ని డబ్బును ఆశగా చూపించి ఎన్నికల బరిలో నుండి తప్పుకొమ్మని ఒత్తిడి చేశారన్నారు. దాన్ని నేను అంగీకరించకపోవడంతో మాపై కక్షపూరితంగా నా భర్తను సస్పెండ్ చేయించి మమ్మల్ని మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇది కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ కుట్ర" అని గీతాంజలి ఆరోపించారు. ఈ సందర్భంగా చేర్యాలలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. తన భర్త సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి, మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. "ఇలాంటి కక్షపూరిత రాజకీయాలు చేయొద్దు. ఏదైనా సమస్య ఉంటే ఎన్నికల్లో ప్రజల ముందు తేల్చుకుందాం" అని గీతాంజలి సవాల్ విసిరారు. ప్రస్తుతం తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ సస్పెన్షన్ స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. బైఠాయించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు, అభ్యర్థి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

“

బంగ్లాలో దాదాపు రూ.1.25 కోట్లమంది హిందువులు ఉన్నారు. వారి హక్కుల కోసం పోరాడాలి అనుకుంటే ప్రపంచంలోని హిందువులంతా వారికి మద్దతుగా నిలుస్తారు. అలాగే ఆర్ఎస్ఎస్‌చీఫ్ పదవికి విరమణ అనేది ఉండదు. ఇప్పటివరకు అలాంటి పరిస్థితి కూడా రాలేదు. అయితే దిగమంటే దిగిపోతాను.

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

ప్రాంతీయం

మాయల పకీరు మాటలు నమ్మకండి

- అభివృద్ధి కోరుకునేవారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలి
- మైనంపల్లి హనుమంతరావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 8: మాయల పకీరు హరీష్‌రావు మాటలు నమ్మవద్దని, మెదక్ పట్టణ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అత్యధికగా మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ఆదివారం 20వ వార్డు అభ్యర్థి మహమ్మద్ మన్సూర్ గెలుపు కోసం వార్డులో విస్తృతంగా పర్యటించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని. అయినా తెలిపారు. పట్టణ అభివృద్ధి కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని అలాగే ఏడుపాయల మెదక్ చర్చి అభివృద్ధి కోసం నిధులు మంజుర చేయడం జరిగిందని ఆయన తెలిపారు పట్టణ అభివృద్ధిని కోరుకునే వారు చేయి గుర్తుకు ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ ప్రచార కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ గౌడ్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బాలకృష్ణ. కాంగ్రెస్ నాయకులు దయాసాగర్ సున్నం నరేష్. తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి

- నాలుగవ వారంకు భారీగా తరలివచ్చిన భక్తులు
- మల్లన్న నామస్మరణంతో మారుమోగిన ఆలయ పరిసరాలు

ప్రతిపక్షం, కొమురవెల్లి, ఫిబ్రవరి 8: కొమురవెల్లి మల్లన్న జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా భక్తులు కొమురవెల్లి మల్లన్న నీకు కోటొక్క దండాలు, సత్తేటి వారాలా స్వామి, నీకు లక్షొక్క దండాలు, కోరమీసాల మల్లన్న నీకు కోటొక్క దండాలు అంటూ భక్తులు శ్రీమల్లికార్జున స్వామిని దర్శించుకొని మొక్కులు సమర్పించారు. ఆదివారం కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో నాల్గవవారంకు భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు భారీగా తరలిరావడతో ఆలయ ప్రాంగాణాలు మొత్తం మల్లన్న నామస్మరణ తో మారుమోగాయి. భక్తులు శనివారం అర్ధరాత్రి నుంచి తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని గంగరేణి చెట్టు, రాజగోపురం, రాతిగీరలు, కోడెల స్తంబం తోటబావి, ఎల్లమ్మ కమాన్, బస్టాండ్ ప్రాంగణం, సినిమా టాకిస్ ప్రాంగణం, రాంసాగర్ రోడ్డులోని కుర్మసంఘం వరకు, పెద్దమ్మ ఆలయ ప్రాంగణాలు, మల్లన్న చెరువు పార్కింగ్ స్థలం, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న ఖాళీ స్థలం భక్తుల విడిదితో పూర్తిగా నిండిపోయాయి. మల్లన్నకు మొక్కులు అప్పగించడానికి వచ్చిన భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి, మల్లన్న స్వామి పుష్కరినిలో స్నానమాచరించారు. ఒక్కపొద్దులతో మట్టికుండలలో మట్టికుండలలో పసుపు బియ్యంతో నైవేద్యం సమర్పించారు. అనంతరం క్యూలైన్లో వెళ్లి మల్లన్నను దర్శించు కున్నారు. మల్లన్న స్వామి దర్శదర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టింది. భక్తులకు కావల్సిన ఏర్పాట్లను ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండ హుస్నాబాద్ ఏసీబీ సదానందం ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేవారు. ఆలయ ఈఓ టంకశాల వెంకటేష్, ఏఈఓ రావుల సుదర్శన్, సూపరింటెంట్ నీల్ల శేఖర్ ఆలయ సిబ్బంది, ధర్మకర్తలు, ఆలయ అధికారులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

గజ్వేల్‌లో బీఆర్ఎస్ విజయం తథ్యం

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 8: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ విజయం తథ్యమని వార్డ్ ఇంచార్జ్ తలకొక్కుల దుర్గాప్రసాద్ స్పష్టంచేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కామునిమురళి గెలుపుకు ఆదివారం వార్డులో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దుర్గాప్రసాద్ ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్ నియోజకవర్గం సాధించిన అభివృద్ధిని ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకుంటున్నారని కొనియాడారు. ప్రచారంలో భాగంగా గత ప్రభుత్వ విజయాలను వారు ప్రజలకు వివరించారు. 150 కోట్లతో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన గోదావరి త్రాగునీరు. వార్డుల్లో సీసీ రోడ్లు, 24 గంటల నాణ్యమైన కరెంటు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం, జిల్లా ఆసుపత్రి మరియు గర్భిణీల కోసం ప్రత్యేక మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటు, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అత్యాధునిక 'ఎడ్యుకేషనల్ హబ్', 330 కోట్లతో రింగ్ రోడ్, రైల్వే లైన్ నిర్మాణం, మహతి ఆడిటోరియం మరియు మోడల్ మార్కెట్లు, నిరుపేదల కోసం 1250 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా, గజ్వేల్ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని వారు విమర్శించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ను దేశంలోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా నిలబెట్టిన ఘనత కేసీఆర్‌దేనని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా కాంగ్రెస్ సేవాదళ్ ప్రచారం

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 8: మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 6వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గాడిపల్లి నవ్యశ్రీ తరపున తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు నేడు ప్రతి ఇంటికి చేరుతున్నాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. అభ్యర్థి నవ్యశ్రీ మాట్లాడుతూ, వార్డులో మౌలిక సదుపాయాలైన తాగునీరు, డ్రైనేజీ మరియు రోడ్ల సమస్యల పరిష్కారమే తన ప్రథమ లక్ష్యమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుకునూర్ పల్లి కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు నరసింహచారి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాజెక్టు పేరుతో దోచుకున్న కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలి

- త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డితో నిర్వాసితులకు పెండింగ్ ప్యాకేజీలు వర్తింప చేస్తా
- మున్సిపల్ అభివృద్ధికి అడిగినన్ని నిధులు ఇస్తాం
- మహిళా సంఘాలకు 21 వేల కోట్లిచ్చాం
- మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 8: ప్రాజెక్టుల నిర్మాణంతో ప్రజాధనాన్ని దోచుకున్న కేసీఆర్ కు గజ్వేల్ ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇన్చార్జి కూన శ్రీశైలం గౌడ్, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డిసిసి అధ్యక్షులు ఆంక్షారెడ్డితో కలిసి ఆదివారం గజ్వేల్, నిర్వాసిత గ్రామాలలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణంతో సర్వం కోల్పోయిన ముంపు బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటామని, ఈ అంశం ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి దృష్టిలో ఉన్నట్లు చెప్పారు. అయినప్పటికీ తన వంతు ప్రయత్నంగా సమస్యలన్నింటికీ కృషి చేయడంతో పాటు వారిని అన్ని రకాలుగా ఆదుకునే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కెసిఆర్, హరీష్ రావుల తప్పుడు నిర్ణయాలతో మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. మల్లన్న సాగర్ పేరుతో బిఆర్ఎస్, కాళేశ్వరం పేరుతో రాష్ట్రాన్ని అందినంత దోచుకున్నట్లు స్పష్టం చేశారు. అసెంబ్లీకి, ప్రజల మధ్యకు రాని కెసిఆర్ అభివృద్ధి పేరిట వేల కోట్లు దండుకోగా, కమిషన్ల కోసం కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు కట్టబెట్టినట్లు విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లలా పరుగులు పెడుతుండగా, ఆరు గ్యారెంటీల్లో భాగంగా పథకాలను పేదలకు వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేశారు. నియోజకవర్గ కార్యకర్తల కృషితో సర్పంచులను గెలిపించుకున్నట్లుగానే, గజ్వేల్ మున్సిపల్ ను దక్కించుకుందామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందజేస్తామని, 21వేల కోట్లను మహిళా సంఘాల సభ్యులకు అందజేస్తుండగా, ఉచిత బస్సు కోసం 9 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. గజ్వేల్ అభివృద్ధికి అడిగినన్ని నిధులు ఇస్తుండగా, ఇటీవల 18 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే మహిళల కోసం 50 వేల కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తుండగా, గ్రామాల్లోని పేదలకు ఇండ్ల నిర్మాణానికి నిధులు, అంతేకాకుండా సన్న బియ్యం ఇవ్వడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మాజీ ఎంపీపీ మోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొనగారి రాజు, వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త తదితరులు పాల్గొన్నారు

'స్వాతి' నక్షత్ర గిరి ప్రదర్శన

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), ఫిబ్రవరి 8: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి జన్మనక్షత్రం (స్వాతి) పురస్కరించుకొని రంగంపేట పీఠాధిపతుల మాధవానంద సరస్వతి, స్వీయ పర్యవేక్షణలో గిరి ప్రదక్షణ కార్యక్రమం అశేష భక్త జనవాహిని పాల్గొనగా, నారసింహ నామస్మరణలతో క్షేత్రం మారుమ్రుగింది. ఆలయ చైర్మన్ రవీందర్ గుప్తా, కార్యనిర్వాణాధికారి బెల్లంకొండ రంగాచారి ఆధ్వర్యంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, ధర్మకర్తలు చందా నాగరాజు, గాలి కిష్టయ్య, కొత్తపల్లి శ్రీనివాస్, ఉషశ్రీ రాజశేఖర్ శర్మ, కర్రె పద్మా వెంకటేష్, సిబ్బంది సుధాకర్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా, సిఎంఆర్ హాస్పిటల్ వారి సౌజన్యంచే ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వచ్చిన భక్తులకు ఉచిత వైద్యమును అందించడం జరిగింది.

కాంగ్రెస్ సర్కార్‌తో విసుగెత్తిన జనం

- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 8 : పోరాడి సాధించుకున్న తెలంగాణ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమే మళ్లీ రావాలని జనం కోరుకుంటున్నారని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మెదక్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 18, 17, 16,19 వార్డులలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు టేకు శంకర్ బట్టి లలిత జగపతి, అవారి. రాజశేఖర్, గొల్ల బోయిన సునీల్ లకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. కాంగ్రెస్ పాలనతో విసుగెత్తిన జనం సారూ..కారు.. సర్కారే మళ్లీ రావాలని కోరుకుంటున్నారన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారని, బీఆర్ఎస్‌ను ఓడించి తప్పు చేశామని జనం భావిస్తున్నారన్నారు. అబద్ధాలకు బ్రాండ్ అం బాసిడర్‌గా కాంగ్రెస్ పార్టీ నిలిచిందని మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, ఆసరా పింఛన్లు, రూ.4వేలు, రైతు భరోసా రూ.15వేలు, కేసీఆర్ కిట్టు, విద్యార్థినులకు స్కూటీలు ఎగ్గొట్టారని మున్సిపల్ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తం చేస్తూ మమ్మల్ని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మెదక్ మున్సిపాలిటీని అభివృద్ధి చేశానని వివరించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును గ్రహించి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ విషయాన్ని గ్రహించే ప్రజలపై వత్తిడి తెస్తూ, బెదిరిస్తున్నారన్నారు. ఈ ప్రచారంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, వార్డ్ ఇన్చార్జులు, పట్టణ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కానిస్టేబుల్ సస్పెన్షన్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 8: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో పాటు పోలీస్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ కె. రమేష్‌ను సస్పెండ్ చేస్తూ సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. హెడ్‌క్వార్టర్స్‌లో విధులకు హాజరు కావాలని ఆదేశించినప్పటికీ ఎటువంటి అనుమతి లేకుండా గైర్హాజరైనట్లు విచారణలో తేలింది. విధులకు గైర్హాజరైన సమయంలో రమేష్ తన స్వస్థలమైన చేర్యాలలో ఉన్నట్లు వెల్లడైంది. అలాగే, చేర్యాల మున్సిపల్ ఎన్నికల్లో 2వ వార్డు సభ్యురాలిగా పోటీ చేస్తున్న తన భార్యకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఆధారాలతో నిరూపితమైంది. బాధ్యతాయుతమైన పోలీస్ సేవలో ఉండి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (ప్రవర్తన) నియమావళి, 1964కి విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. క్రమశిక్షణ చర్యలు పూర్తయ్యే వరకు కె. రమేష్‌ను సస్పెన్షన్‌లో ఉంచుతున్నట్లు తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన ఏడుపాయల జాతర ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజా

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 8: యుద్ధ ప్రాతిపదికన సామాన్య భక్తులకు సౌకర్యార్థం వివిధ శాఖల ద్వారా చేపడుతున్న ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో ఏడుపాయల జాతర ఏర్పాట్లు, పనుల ప్రగతిని, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, త్రాగునీటి సౌకర్యార్థం ఇంట్రా గ్రిడ్ సంపు , భక్తులు స్థానాలు ఆచరించే దగ్గర, బార్కేడింగ్ , తాత్కాలిక మరుగుదొడ్లు సౌకర్యాలను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతర సమయం దగ్గర పడుతున్నందున పనుల్లో వేగం పెంచి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని . ఫిబ్రవరి 15 మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏడుపాయలలో జరిగే అతి పెద్దజాతరకు లక్షలాది మంది భక్తులు తరలి రానున్నందున అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు జాతరలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని, పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసి చెత్తా చెదారం తరలించేందుకు గ్రామ పంచాయతీ వాహనాలను ఉపయోగించుకోవాలన్నారు. త్రాగునీటికి సంబంధించి నల్లా/ట్యాప్ బిగించి ట్రయల్ రన్ నిర్వహించి సిద్ధంగా ఉంచాలన్నారు. జాతర పరిసర ప్రాంతాలతో పాటు నదీపరీవాహక ప్రాంతాల ఇరుపక్కల ఎస్ఈడీ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్ రెడ్డి, రోడ్ల భవనాల శాఖ ఈ.ఈ వేణు, ఇంట్రా గ్రిడ్ నాగభూషణం, మిషన్ భగీరథ ఈ.ఈ సంపత్ కుమార్, పంచాయతీరాజ్, ఈ. ఈ నరసింహ చారి, సంబంధిత ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం లోనే మెదక్ పట్టణ అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 8: కారు గుర్తుకు ఓటు వేస్తే హరీష్ రావుకు ఓటు వేసినట్లు మరోసారి మెదక్ అభివృద్ధి అడ్డుకోవడం జరుగుతుందని మెదక్ అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమవుతుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఒకటి రెండు మూడు నాలుగు వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థుల తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలు డప్పు వాయిద్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లిహనుమంతరావు మాట్లాడుతూ గత పది సంవత్సరాల పాలనలో మద్దతు పట్టణ అభివృద్ధి చెందలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి చెందిందని

ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలలో మెదక్ కు వెల కోట్ల నిధులతో పనులు కొనసాగుతున్నాయని మిగితా పెండింగ్ పనులు ముఖ్యమంత్రి తో పూర్తి చేయిస్తామన్నారుకాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే మెదక్ మున్సిపల్లోన్ని అన్ని వార్డులను శాశ్యశ్యామలంగా తీర్చిదిద్దుతామన్నారు. వార్డులలో అంతర్గత డ్రైనేజీలు సీసీ రోడ్లను వ్యవస్థను పూర్తి చేస్తామన్నారు. త్వరలో రింగ్రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. భారత రాష్ట్ర సమితికి ఓటు వేస్తే హరీష్ రావు మెదక్ పట్టణ అభివృద్ధిని అడ్డుకుంటాడని ఆయన తెలిపారు ఇప్పటికే గత పది సంవత్సరాల పాలనలో మెదక్ నియోజకవర్గానికి వచ్చిన నిధులు అన్ని సిద్దిపేట ప్రాంతానికి తరలించకపోయాడని ఆయన తెలిపారు ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఆయన తెలిపారు ఈనెల జరిగే 11 తేదీన జరిగే ఎన్నికలలో చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశాడు ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థులు నర్సింలు మహిపాల్ కాంగ్రెస్ నాయకులు బజ్జ పవన్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో బూతులు మాట్లాడే ఏకైక సీఎంగా రేవంత్ రెడ్డి మిగిలిపోతారు. ఆయన అత్యంత దరిద్రపు ముఖ్యమంత్రి. రెండేళ్లుగా కేసీఆర్ను తిట్టడం తప్పించి చేసిందేమీ లేదు. రోజూ రూ.వందల కోట్లు దోచుకోవడమే ఏకైక అజెండాగా పెట్టుకున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాకుంటే కాంగ్రెస్ వాళ్లు మరో మూడేళ్ల దాకా దొరకరు, వారికి బుద్ధి చెప్పాలి.

- తాండూరు సభలో కేటీఆర్

విశ్వ వీక్షణం

మార్చి 31 లోపు నక్సలిజం అంతం

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: దేశంలో వచ్చే మార్చి 31లోపు నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. మావోయిస్టుల ఏరివేత అంశంపై ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31లోపు నక్సలిజాన్ని పూర్తిగా తుడిచివేస్తామన్నారు. వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతంలో మావోయిస్టుల నిధులను అడ్డుకోవడం, లొంగుబాటు చర్యలు, భద్రతా దళాల ఆపరేషన్స్, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలు మావోయిస్టుల ప్రభావాన్ని గణనీయంగా తగ్గించాయన్నారు. ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వ అధికారులు, భద్రతా దళాలతో ఈ సమావేశం జరిగిందని అమిత్ షా వెల్లడించారు. కొన్నేళ్లుగా నక్సల్స్ కార్యకలాపాలు బలహీనంగా మారాయన్నారు. ఈ సమావేశానికి ఛత్తీస్‌ఘడ్ సీఎం విష్ణు దేవ్ సాయి, డీసీఎం విజయ్ శర్మ, కేంద్ర హోం శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోలు ఎక్కువగా ఉంటారు. ఈ ప్రాంతం మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ, ఒడిశాలతో సరిహద్దు పంచుకుంటుంది.ఇటీవల ఛత్తీస్‌ఘడ్ పోలీసులు వెల్లడించిన డాటా ప్రకారం.. ఈ ప్రాంతంలో 2024 నుంచి 500 మందికిపైగా నక్సలైట్లు ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయారు. వీరిలో మావో అగ్రనేత నంబాల కేశవరావు కూడా ఉన్నారు. ఈ రెండేళ్ల కాలంలో 1,900 మందికిపైగా నక్సలైట్లు అరెస్టయ్యారు. 2,500 మందికిపైగా లొంగిపోయారు.

మలేషియాలో యూపీఐ సేవలు

- భారతీయులకు ఎంతో మేలన్న ప్రధాని మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఇండియాలో దూసుకుపోతున్న యూపీఐ సేవలు త్వరలో మలేసియాలో కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ.. మలేసియా వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. మలేసియాలో కూడా త్వరలోనే యూపీఐ సేవల్ని అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. అయితే, ఎప్పటినుంచి అందుబాటులోకి వచ్చేది వెల్లడించలేదు. ఈ సేవలు అక్కడ ఉంటున్న భారతీయులకు మేలు కలిగిస్తాయని మోదీ అన్నారు. మలేసియాలో రాబోయే యూపీఐ సేవలు వీపీఏ (వర్చువల్ పేమెంట్ అడ్రస్), లేదా క్యూఆర్ కోడ్, లేదా మొబైల్ నెంబర్ ద్వారా అందుబాటులోకి వస్తాయి. బ్యాంక్ అకౌంట్లతో పని లేకుండా ఈ సేవల్ని వినియోగించుకోవచ్చు. టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ద్వారా ఈ సేవలకు భద్రత ఉంటుంది. మరోవైపు దేశంలో యూపీఐ సేవలు దూసుకెళ్తున్నాయి. గత ఏడాది 640 మిలియన్ల ట్రాన్సాక్షన్స్ జరిగినట్లు గణాంకాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది వాడుతున్న వీసా కార్డ్ సేవల కంటే మన యూపీఐ సేవలే అధికం. ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న డిజిటల్ ట్రాన్సాక్షన్స్‌లో సగానికిపైగా ఇండియాలోనే జరుగుతున్నాయి. మోదీ రెండు రోజుల మలేసియా పర్యటనలో భాగంగా ఆ దేశంతో కీలక ఒప్పందాలు చేసుకున్నారు. రక్షణ, వ్యాపారం, సహకారం, సెమీకండక్టర్ల సరఫరా వంటి అంశాల్లో ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరాయి. మరోవైపు వివాదాస్పద మత గురువు జాకీర్ నాయక్‌ను ఇండియాకు అప్పగించే అంశంపై కూడా ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. ఇండియాకు చెందిన జాకీర్ నాయక్.. కొన్నేళ్లుగా మలేసియాలో ఉంటున్నాడు.

జుట్టు రాలుతోందా?

జుట్టు రాలడం అనేది స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా అన్ని వయసుల వారినీ, ప్రాంతాల వారినీ వేధించే ఒక సాధారణ సమస్య. రోజూ కొన్ని వెంట్రుకలు రాలడం సహజమే అయినా, అధికంగా జుట్టు రాలడం ఆందోళన కలిగిస్తుంది, ఆత్మవిశ్వాసాన్ని తగ్గిస్తుంది. అయితే, సరైన అవగాహన, సకాలంలో చికిత్స, మరియు నిరంతర సంరక్షణతో జుట్టు రాలడాన్ని నియంత్రించవచ్చు. జుట్టు రాలడానికి గల కారణాలను తెలుసుకోవడం, ప్రభావవంతమైన చికిత్సా పద్ధతులు, ఆచరణీయమైన పరిష్కారాలు మరియు ప్రత్యేకమైన ఆహారం ద్వారా ఆరోగ్యకరమైన, ఒత్తైన జుట్టును తిరిగి పొందవచ్చు.

ఇది సాధారణమా, కాదా?

జుట్టు రాలడం గురించి మనం వివరంగా తెలుసుకునే ముందు, సాధారణంగా జుట్టు ఎంత రాలుతుందో అర్థం చేసుకుందాం. సగటున, ఒక వ్యక్తికి రోజుకు 50 నుండి 100 వెంట్రుకలు రాలడం సహజం. ఇది వెంట్రుకల పెరుగుదల చక్రంలో భాగం, మరియు ఇది పూర్తిగా సాధారణమైనది. ఈ చక్రంలో మూడు ప్రధాన దశలు ఉంటాయి:

ఎనాజెన్ (పెరుగుదల దశ): ఇది వెంట్రుకలు పెరిగే దశ, సాధారణంగా 27 సంవత్సరాలు ఉంటుంది. మీ జుట్టులో సుమారు 85 90% ఎప్పుడూ ఈ దశలోనే ఉంటుంది.

కాటాజెన్ (పరివర్తన దశ): ఇది 23 వారాలు ఉంటే చిన్న పరివర్తన దశ, ఈ సమయంలో వెంట్రుకల పెరుగుదల ఆగిపోతుంది.

టెలోజెన్ (విశ్రాంతి దశ): ఈ దశ సుమారు 24 నెలలు ఉంటుంది, ఆ తర్వాత వెంట్రుకలు రాలిపోతాయి, మరియు కుదుళ్ల నుండి కొత్త వెంట్రుకలు పెరగడం.

మీరు అధిక జుట్టు రాలడాన్ని గమనించినప్పుడు, దాని అర్థం సాధారణం కంటే ఎక్కువ వెంట్రుకలు ముందుగానే టెలోజెన్ దశలోకి ప్రవేశిస్తున్నాయి, లేదా రాలిపోయిన వెంట్రుకల స్థానంలో కొత్తవి పెరగడం లేదు. ఈ అసమతుల్యతే జుట్టు రాలే సమస్యకు మూలం.

అకస్మాత్తుగా, తీవ్రంగా జుట్టు రాలడం.

తల మీద అక్కడక్కడా గుండ్రంగా జుట్టు ఊడిపోవడం తలలో దురద, ఎరుపుదనం, నొప్పి లేదా పొరలుగా జుట్టు ఊడటం.

జుట్టు రాలడంతో పాటు బరువు ఇతర లక్షణాలు (ఉదాహరణకు, అలసట,లో మార్పులు, శరీరంలో ఇతర చోట్ల అసాధారణ రోమ పెరుగుదల) కనిపించడం.

ఇంటి చిట్కాలు మరియు ఆహార మార్పులతో ఎటువంటి మెరుగుదల లేకపోవడం.

జుట్టు రాలడానికి ఖచ్చితమైన కారణాలను మరియు అత్యంత సరైన చికిత్సను సూచించడానికి వైద్యులు రక్త పరీక్షలు, స్కాల్ప్ బయాప్సీ నిర్వహిస్తారు. జుట్టు రాలడం అనేది చాలా మందిలో కనిపించే ఒక సమస్య అయినప్పటికీ, దీనిని సమర్థంగా ఎదుర్కోవచ్చు. జుట్టు రాలడానికి గల కారణాలను అర్థం చేసుకోవడం, ప్రభావవంతమైన పరిష్కారాలను పాటించడం, ఆరోగ్యకరమైన ఆహార ప్రణాళికను అనుసరించడం, మరియు అవసరమైనప్పుడు నిపుణులు నుంచి వైద్య సహాయం తీసుకోవడం ద్వారా ఈ సమస్యను నియంత్రించవచ్చు. ఓపికతో, నిలకడగా, మరియు మీ జుట్టు పట్ల సున్నితంగా వ్యవహరించడం ద్వారా, మీరు దాని ఆరోగ్యాన్ని, సాంద్రతను తిరిగి పొందవచ్చు, ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పొందవచ్చు. పెంచుకోవచ్చు, మరియు మీ జుట్టును మళ్ళీ నిండుగా, ఆరోగ్యంగా మార్చుకోవచ్చు.

జుట్టు పలచబడి ఎందుకు రాలుతుంది?

జుట్టు రాలడానికి గల మూల కారణాన్ని గుర్తించడం సమస్యను సరిగ్గా నియంత్రించడానికి అత్యంత కీలకమైన అడుగు. జుట్టు రాలడానికి అనేక కారణాలు ఉండవచ్చు అవి తాత్కాలిక సమస్యల నుండి దీర్ఘకాలిక పరిస్థితుల వరకు ఉంటాయి.

వంశపారంపర్యత (ఆండ్రోజెనెటిక్ అలోపేసియా): ఇది జుట్టు రాలడానికి అత్యంత సాధారణ కారణం. దీనిని తరచుగా పురుషులలో బట్టతల (పురుషనమూనా బట్టతల) లేదా స్త్రీలలో బట్టతల (ఆడనమూనా బట్టతల) అని పిలుస్తారు. ఇది వారసత్వంగా వస్తుంది మరియు కాలక్రమేణా జుట్టు క్రమంగా పలచబడటానికి పుట్టింది. పురుషులలో జుట్టు వెనక్కి పోవడం లేదా తలపై (బట్టతల) పలచబడటం, మరియు స్త్రీలలో తల అంతట జుట్టు పలుచబడటం దీని యొక్క ముఖ్యమైన లక్షణాలు.

హార్మోన్ల అసమతుల్యత:
థైరాయిడ్ సమస్యలు: థైరాయిడ్ గ్రంధి అధికంగా పనిచేసినా (హైపర్‌థైరాయిడిజం) లేదా తక్కువగా పనిచేసినా (హైపోథైరాయిడిజం) జుట్టు పెరుగుదల చక్రం దెబ్బతిని, జుట్టు విపరీతంగా రాలడానికి.

గర్భధారణ మరియు ప్రసవం: చాలా మంది మహిళలు ప్రసవించిన కొన్ని నెలల తర్వాత హార్మోన్ల మార్పుల వల్ల జుట్టు రాలడాన్నిఅనుభవిస్తారు. ఇది సాధారణంగా తాత్కాలికమే.

మెనోపాజ్: మెనోపాజ్ సమయంలో ఈస్ట్రోజెన్ స్థాయిలు తగ్గడం కూడా జుట్టు పలచబడటానికి సహాయపడుతుంది.

ఒత్తిడి: తీవ్రమైన శారీరక లేదా మానసిక ఒత్తిడి (ఉదాహరణకు, శస్త్రచికిత్స, తీవ్రమైన అనారోగ్యం, డిప్రెషన్, తీవ్రమైన మానసిక రుగ్మతలు మొదలైనవి) పెద్ద సంఖ్యలో జుట్టును దెబ్బతీయవచ్చు. ఈ రకమైన జుట్టు రాలడం సాధారణంగా ఒత్తిడితో కూడిన సంఘటన 23 నెలల తర్వాత జరుగుతుంది మరియు సాధారణంగా తిరిగి సాధారణ స్థితికి వస్తుంది.

పోషకాహార లోపాలు: మీ జుట్టు కుదుళ్లకు స్థిరమైన పోషకాల సరఫరా అవసరం. ఈ క్రింద వివరించిన లోపాలు జుట్టు రాలడానికి కొంతమేరకు కారణం కావచ్చు:

ఐరన్ (ఇనుము): ఐరన్ లోపం వల్ల వచ్చే రక్తహీనత జుట్టు రాలడానికి చాలా సాధారణ కారణం, ముఖ్యంగా

జింక్ (జింక్): జింక్ లోపం జుట్టు పలచబడటానికి కూడా.

మందులు (మందులు): కొన్ని మందులు జుట్టు రాలడాన్ని దుష్ప్రభావంగా కలిగి ఉండవచ్చు, వీటిలో:
రక్తం పలచబడే మందులు (రక్తాన్ని పలుచబరిచేవి)
అధిక రక్తపోటు మందులు (బీటాబ్లాకర్స్)
యాంటీప్రెసెంట్స్ (యాంటిడిప్రెసెంట్స్)
కీమో థెరపీ మందులు (ఇవి విస్తృతంగా మరియు తీవ్రమైన జుట్టు రాలడానికి కారణం)

వైద్య పరిస్థితులు:
అలోపేసియా ఏరియాటా (Alopecia Areata): ఇది ఒక ఆటోమ్యూన్ పరిస్థితి, రోగనిరోధక వ్యవస్థ పొరపాటున జుట్టు కుదుపుల మీద దాడి చేస్తుంది, దీనివల్ల అక్కడక్కడా గుండ్రంగా జుట్టు రాలిపోతుంది.

తలపై ఇన్ఫెక్షన్లు: రింగ్‌వార్మ్ (రింగ్‌వార్మ్) వంటి ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు పొరలుగా దురదతో కూడిన మచ్చలు మరియు జుట్టు రాలడానికి కారణమవుతాయి.

ల్యూపస్ (లూపస్): ఇది ఒక ఆటోఇమ్యూన్ వ్యాధి, దీనివల్ల మచ్చలతో కూడిన బట్టతల రావచ్చు.

జుట్టు స్టైలింగ్ సంరక్షణ పద్ధతులు:

జుట్టును గట్టిగా లాగి ముడి వేయడం (గట్టి పోనీటెయిల్స్), జడలు అల్లడం వంటి గట్టి కేశాలంకరణల వల్ల వెంట్రుకల మూలాలపై నిరంతరం ఒత్తిడి పడి జుట్టు రాలుతుంది. అధిక వేడితో స్టైలింగ్ చేయడం (స్ట్రెయిట్నర్లు, కర్లింగ్ ఐరన్లు, బ్లో డ్రైయర్లు). తీవ్రమైన రసాయన చికిత్సలు (పెర్మ్‌లు, రిలాక్సర్‌లు, బ్లీచింగ్). అధికంగా దువ్వడం లేదా గట్టిగా టవల్‌తో రుద్దడం వల్ల కూడా జుట్టు బలహీనపడుతుంది. వేగంగా లేదా ఎప్పుడైనా బరువు తగ్గడం, ముఖ్యంగా కఠినమైన ఆహార నియమాల వల్ల జరిగితే, తాత్కాలికంగా జుట్టు రాలడానికి ఆస్కారం ఉంది.

కారణాలకు చికిత్స

థైరాయిడ్ మందులు: థైరాయిడ్ అసమతుల్యత వల్ల జుట్టు రాలుతుంటే, థైరాయిడ్ స్థాయిలను సాధారణీకరించే మందులు జుట్టు రాలడాన్ని నివారిస్తాయి.

పోషకాహార సప్లిమెంట్స్: పోషకాల లోపాలు గుర్తించడం, వైద్య పర్యవేక్షణలో తగిన సప్లిమెంట్లు (ఐరన్, విటమిన్ డి, జి, బయోటిన్) సూచిస్తారు.

యాంటీఫంగల్ మందులు: తలపై ఇన్ఫెక్షన్ల కోసం.

జుట్టు రాలకుండా నియంత్రణ చర్యలు & పరిష్కారాలు: జీవనశైలి మార్పులు జుట్టు రాలడం తీవ్రంగా ఉన్నప్పుడు నిపుణుల చికిత్స అవసరం అయినప్పటికీ, అనేక సందర్భాల్లో సాధారణ చిట్కాలు మరియు జీవనశైలి మార్పుల ద్వారా జుట్టు రాలడం తగిన విధంగా నియంత్రించవచ్చు.

సున్నితమైన జుట్టు సంరక్షణ పద్ధతులు:

జుట్టును సున్నితంగా కడగండి: సల్ఫేట్ లేని (సల్ఫేట్ రహిత), తేలికపాటి షాంపూని వాడండి. వేడి నీటిని ఉపయోగించడం మానుకోండి, ఎందుకంటే ఇది జుట్టులోని సహజ నూనెలను తొలగిస్తుంది.

నియమబద్ధంగా కండిషనర్ వాడండి: జుట్టుకు తేమను అందించడానికి మరియు చిట్లడం మంచి కండిషనర్‌ను అందించడానికి.

జాగ్రత్తగా చిక్కులు తీయండి: తడి జుట్టుకు చిక్కులు తీసేటప్పుడు వెడల్పాటి పళ్లతో ఉన్న దువ్వెనను వాడండి, చివర్ల నుండి పైకి దువ్వండి.

హీట్ స్టైలింగ్ను తగ్గించండి: బ్లో డ్రైయర్‌లు, ఫ్లాట్ ఐరన్‌లు, మరియు కర్లింగ్ ఐరన్‌ల వాడకాన్ని తగ్గించండి. తప్పనిసరిగా వాడాల్సి వస్తే, హీట్ ప్రొటెక్టెంట్ స్ప్రేని అప్లై చేయండి.

గట్టి కేశాలంకరణలను నివారించండి: గట్టి పోనీటైల్స్, చిక్కులతో కూడిన జడలు లేదా ఇతర గట్టి హెయిర్‌స్టైల్స్ నుండి మీ జుట్టుకు విరామం ఇవ్వండి. ఇది ట్రాక్షన్ అలోపేసియాను నివారిస్తుంది.

చాలావరకు ఆరబెట్టండి: మీ జుట్టును సహజమైన గాలితో ఆరనివ్వండి.

సంరక్షణ చిట్కాలు :

స్కాల్ప్ మసాజ్: జుట్టు కుదుళ్లకు రక్త ప్రసరణను పెంచడానికి, జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి క్రమం తప్పకుండా, సున్నితంగా తలపై మసాజ్ చేయండి. కొబ్బరి నూనె లేదా ఆలివ్ నూనె వంటి క్యారియర్ ఆయిల్‌లో కొన్ని చుక్కల రోజ్‌మేరీ లేదా పిప్పర్‌మెంట్ వంటి ఎసెన్షియల్ ఆయిల్స్‌ను (ఎప్పుడూ ఎసెన్షియల్ ఆయిల్స్‌ను పలుచబరిచి వాడాలి) కలిపి వాడవచ్చు.

ఉల్లిపాయ రసం: ఉల్లిపాయ రసంలో సల్ఫర్ పుష్కలంగా, ఇది తలకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది మరియు కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుందని నమ్ముతారు. తాజా ఉల్లిపాయ రసాన్ని తలకు అప్లై చేసి, 1530 నిమిషాలు ఉంచి, ఆపై షాంపూతో కడగండి.

మెంతి గింజలు (ఫెనుగ్రీక్ సీడ్స్): మెంతి గింజలను రాత్రంతా నానబెట్టి, పేస్ట్‌గా రుబ్బుకోవడం ద్వారా ప్రొటీన్ మరియు నికోటినిక్ యాసిడ్‌లను అందిస్తుంది, ఇవి రెండు జుట్టు పెరుగుదలకు చాలా ఎక్కువ. ప్రయోజనకరమైనవి. ఈ పేస్ట్‌ను తలకు మరియు జుట్టుకు అప్లై చేసి, 30 నిమిషాలు ఉంచి, ఆపై శుభ్రం చేసుకోండి.

జీవనశైలి మార్పులు:

ఒత్తిడి నిర్వహణ: ఒత్తిడి జుట్టు రాలడానికి ఒక ప్రధాన కారణం కాబట్టి, ఒత్తిడిని తగ్గించే కార్యకలాపాలను దైనందిన జీవితంలో చేర్చుకోవడం చాలా ముఖ్యం:
యోగ మరియు ధ్యానం
లోతైన శ్వాస వ్యాయామాలు
క్రమం తప్పకుండా వ్యాయామం
తగినంత నిద్ర (79 గంటలు)

క్రమం తప్పకుండా ట్రిమ్ చేయండి: ఇది కుదుళ్ల నుండి జుట్టు రాలడాన్ని నేరుగా ఆపనప్పటికీ, స్ప్లిట్ ఎండ్స్‌ను (చివర్లు చిట్లడం) క్రమం తప్పకుండా ట్రిమ్ చేయడం జుట్టు విరిగిపోకుండా నిరోధిస్తుంది మరియు మీ జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా కనిపించేలా చేస్తుంది.

జుట్టు రాలడాన్ని నియంత్రించడంలో ఆహారం యొక్క పాత్ర: పోషకాహారం (హెయిర్ ఫాల్ డైట్)
మీరు తీసుకునే ఆహారం మీ జుట్టు ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహార ప్రణాళిక బలమైన, ఆరోగ్యకరమైన జుట్టుకు ప్రాథమికమైనది మరియు జుట్టు రాలడాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ కింది పోషకాలను మీ ఆహారంలో చేర్చుకోవడంపై దృష్టి పెట్టండి

సంఘ్ ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడే తప్పుకుంటా

- పదవీ విరమణపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, ఫిబ్రవరి 8: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ తన రిటైర్మెంట్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. వయసుతో సంబంధం లేకుండా తన పనిని కొనసాగించాలని, సంఘ్ తనను కోరిందని ఆయన పేర్కొన్నారు. అయితే, సంస్థ ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడు తాను ఆ పదవి నుంచి వైదొలుగుతానని ఆయన స్పష్టం చేశారు. సంఘ్ అధిపతిగా ఉండే వ్యక్తి కులంతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ హిందువే అయి ఉంటారని, ఈ అత్యున్నత పదవికి అందుబాటులో ఉన్న ఉత్తమ అభ్యర్థిని ఎంపిక చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముంబయిలో 'సంఘ్ ప్రస్థానానికి వందేళ్లునూతన దిగంతాలు అనే 2 రోజుల కార్యక్రమంలో భాగవత్ ప్రసంగించారు. "నాకు 75 ఏళ్లు నిండాయి. ఈ విషయాన్ని ఆర్ఎస్ఎస్‌కు తెలియజేశాను. కానీ సంస్థ నన్ను పనిని కొనసాగించమని కోరింది. సంఘ్ ఎప్పుడు పదవి నుంచి వైదొలగమని అడిగితే అప్పుడు నేను వైదొలుగుతాను. కానీ పని నుంచి విరమణ మాత్రం ఎప్పటికీ ఉండదు. ఆర్ఎస్ఎస్ చీఫ్ పదవికి ఎన్నికలు ఉండవు. రీజినల్, డివిజనల్ అధిపతులు సర్‌సంఘ్‌చాలక్‌ను నియమిస్తారు. సాధారణంగా 75 ఏళ్లు నిండిన తర్వాత ఎలాంటి పదవిలో లేకుండా పని చేయాలని అంటారు." అని అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులు సహా మైనార్టీలపై దాడులు జరుగుతున్న వేళ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో దాదాపు కోటిన్నర మంది హిందువులు ఉన్నారని, వారంతా అక్కడే ఉండి పోరాటం చేయాలనుకుంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులందరూ వారికి సాయం చేస్తారని అన్నారు. గత ప్రభుత్వాలు దేశ జనాభాలో వచ్చిన మార్పులపై ఆశించినంతగా పనిచేయలేదని విమర్శించారు. జననాల రేటు, అక్రమ వలసలు ఆ మార్పు వెనుక ప్రధాన కారణమని ఆర్ఎస్ఎస్ చీఫ్ అన్నారు. ఇప్పటి ప్రభుత్వం ఆ దిశగా పనిచేస్తోందని కితాబునిచ్చారు. వీర సావర్కర్‌కు భారతరత్న ఇస్తే అవార్డ్ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందన్నారు. సిద్ధాంతపరమైన విధానాలకు కట్టుబడి ఉండటంతోపాటు వాలంటీర్ల కృషి వల్ల సంఘ్‌కు మంచి రోజులు వచ్చాయని మోహన్ భాగవత్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రచారం చేయడం సంఘ్ పని కాదని, సంస్కారాలను పెంపొందించడమేనని చెప్పుకొచ్చారు.

జీవితంలో పట్టుదలతో ముందుకు సాగాలి

- 'జెన్ జీ' యువతకు రాహుల్ గాంధీ సందేశం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: నేటి యువత జీవితంపై అతిగా ఒత్తిడి పడాల్సిన అవసరం లేదని, జీవితం ఎప్పుడూ ఒకే దారిలో సూటిగా సాగదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆలోచనలు మార్చుకుంటూ, పట్టుదలతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని జెన్‌జీకి సందేశం ఇచ్చారు. ఆదివారం ఢిల్లీలో యూఏఈకి చెందిన ఎన్ఆర్ఐ జెన్‌జీ విద్యార్థులతో రాహుల్ గాంధీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యువత అడిగిన ప్రశ్నలకు ఆయన నేరుగా, ఎలాంటి ఫిల్టర్లూ లేకుండా సమాధానాలు ఇచ్చారు. ఆ సంభాషణకు సంబంధించిన వీడియోను తన యూట్యూబ్ ఛానల్‌లో పంచుకున్నారు. విద్యార్థులతో చర్చలో నేటి యువత ఎదుర్కొంటున్న ఒత్తిడులు, భవిష్యత్‌పై అనిశ్చితి, కెరీర్ ఎంపికలపై సందేహాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. కెరీర్‌తో పాటు ప్యాషన్‌ను ఎలా కొనసాగించాలి? స్వేచ్ఛగా ఆలోచించడానికి, మాట్లాడడానికి ధైర్యం ఎలా పెంపొందించుకోవాలి? ఇతరుల విమర్శలు, జడ్జ్‌మెంట్‌ను ఎలా ఎదుర్కోవాలి? వంటి ప్రశ్నలను విద్యార్థులు ముందుంచారు. వారిలో చాలామంది తమకు ఆత్మవిశ్వాసం తక్కువగా ఉందని, ఇతరులు ఎలా చూస్తారోనన్న భయం వెంటాడుతోందని తెలిపారు. దీనిపై స్పందించిన రాహుల్ గాంధీ, సమాజం మనపై లేబుల్స్ వేయడానికి ప్రయత్నిస్తుందని, కానీ మన అసలైన వ్యక్తిత్వాన్ని మనమే నిర్ణయించుకోవాలని సూచించారు. "ప్రపంచం మీకు మీరు ఎవరో చెబుతుంటుంది. కానీ మీకు మీరు నిజాయితీగా ఉండటం ముఖ్యమైంది" అన్నారు. కెరీర్ ఎంపికలపై మాట్లాడుతూ, "మీకు నచ్చిన పని చేయండి. మీ ఉద్దేశం మంచిదైతే భయపడాల్సిన అవసరం లేదు. ఇతరులు ఏమనుకుంటారన్నది పక్కన పెట్టండి" అని యువతకు ధైర్యం చెప్పారు. తన భారత్ జోడో యాత్ర అనుభవాలను గుర్తు చేసుకుంటూ, "మన పరిమితి మనం అనుకున్నదానికంటే ఎక్కువ. దేశవ్యాప్తంగా ఎన్నో వర్గాల ప్రజలను కలిసిన తర్వాత ప్రతి ఒక్కరికీ తమ సొంత ప్రయాణం ఉందని తెలుసుకున్నాను. ఆ ప్రయాణాన్ని వారు స్వేచ్ఛగా అనుభవించాలి" అన్నారు. మతం, కులం పేరుతో విభజించకుండా అందరికీ ఆలోచించే స్వేచ్ఛ ఉండాలని చెప్పారు.

ఇండియా చేరుకున్న ప్రపంచ విజేతలు

పురుషుల అండర్ 19 వన్డే ప్రపంచకప్ విజేత భారత జట్టు సగర్వంగా స్వదేశంలో అడుగుపెట్టింది. ఆరోసారి రికార్డు టైటిల్‌తో యావత్ భారతావని గర్వపడేలా చేసిన ఆయుశ్ మాత్రే బృందం ఆదివారం ముంబై విమానాశ్రయంలో దిగింది. జగజ్జేతలుగా తిరిగొచ్చిన టీమిండియా క్రికెటర్లకు కుటుంబ సభ్యులు, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది, అభిమానులు ఘన స్వాగతం పలికారు. సొంతగడ్డపై తమను ఘనంగా ఆహ్వానించడంపై యువ క్రికెటర్లు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. అండర్ 19 ఛాంపియన్లుగా స్వదేశం విచ్చేసిన భారత క్రికెటర్లను చూసి కుటుంబసభ్యులు పొంగిపోయారు. టీమిండియా విజయంలో కీలకమైన కెప్టెన్ ఆయుశ్ మాత్రే, వైభవ్ సూర్యవంశీ, అభిగ్యాన్ కుందు, హెనిల్ పటేల్ ముంబై విమానాశ్రయం చేరుకున్నారు. వారిని చూసేందుకు మీడియా, అభిమానులు భారీగా తరలి వచ్చారు. పేసర్ హెనిల్ పటేల్ మాట్లాడుతూ.. దేశం కోసం వరల్డ్‌కప్ గెలవాలని అందరం లక్ష్యంగా పెట్టుకున్నాం. అనుకున్నట్టే సాధించాం. నా తదుపరి లక్ష్యం సీనియర్ జట్టుకు ఆడడమే అని చెప్పాడు. వికెట్ కీపర్ అభిగ్యాన్ కుందు స్పందిస్తూ.. ప్రపంచ కప్ గెలిచినందుకు తమకు ఎంతో గర్వంగా ఉందని అన్నాడు. ఇక కెప్టెన్ ఆయుష్ మాత్రే తండ్రి యోగేశ్ కమలాకర్ మాత్రే పట్టలేనంత సంతోషంగా ఉందన్నాడు. అండర్ 19 ప్రంపచకప్ గెలుపొందడం ద్వారా ఆయుశ్ దేశమంతా గర్వపడేలా చేశాడు అని ఆయన పేర్కొన్నాడు.



స్వదేశంలో టీ20 వరల్డ్ కప్ నా కల

- దేవుడు నాకది రాసిపెట్టాడు: సిరాజ్

మొన్నటి వరకూ విహారయాత్ర ప్రణాళికలు వేసుకున్న మియా భాయ్ అనుకోకుండా టీ20 ప్రపంచకప్ స్క్వాడ్‌లోకి వచ్చాడు. హర్షిత్ రానా స్థానంలో చోటు దక్కించుకున్న అతడు.. బుమ్రా గాయపడడంతో తుది జట్టులో ఉండి.. పవర్ ప్లేలో రెండు వికెట్లతో యూఎస్ఏను ఓడించడంలో కీలకమయ్యాడు. తనకు వరల్డ్‌కప్ ఆడే అవకాశం రావడంపై సిరాజ్ రియాక్షన్ ఏంటంటే.. రెండేళ్లుగా టీ20 జట్టులోకి రాని సిరాజ్ ఏకంగా ప్రపంచకప్‌లో ఎంట్రీ ఇచ్చాడు. పేస్ ఆల్‌రౌండర్ హర్షిత్ రానా మోకాలి గాయంతో టోర్నీకి దూరమవ్వడంతో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సీనియరైన సిరాజ్‌కు ఫోన్ చేసి వచ్చేయాలని చెప్పాడు. ఇదే విషయాన్ని వాంఖడేలో ఆరంభ పోరు తర్వాత మీడియాతో పంచుకున్నాడు హైదరాబాదీ స్పీడ్‌స్టర్. ముంబైకి విమానంలో వస్తుంటే.. నేను వరల్డ్‌కప్ ఆడడమా.. ఇది కలా? నిజమా? అనిపించింది. ఎందుకుంటే.. ఏడాదిగా వరల్డ్‌కప్ కోసం అందరూ కష్టపడుతున్నారు. నాకు అవకాశం రాదులే అనుకున్నా. అయితే.. రెండు రోజుల క్రితం స్ట్రెంత్ కండీషనింగ్ కోచ్ అడ్రియాన్ లె రౌక్స్ మెసేజ్ చేసి నీ ప్రణాళికలు ఏంటీ? అని అడిగాడు. అప్పటికే రంజీ ట్రోఫీలో నాలుగు రోజులు ఆడిన నేను విశ్రాంతి తీసుకుంటున్నా. సో.. అతడికి రిప్లయ్ ఇవ్వలేదు. కాసేపటికే సూర్యభాయ్ ఫోన్ చేశాడు. మియా.. నీ వస్తువులు బ్యాగులో సర్దుకో.. వచ్చి స్క్వాడ్‌లో చేరు అని నాతో అన్నాడు. మొదట నేను అతడి మాటల్ని సీరియస్‌గా తీసుకోలే. జోక్ చేస్తున్నాడేమో అనుకున్నా. స్వదేశంలో టీ20 ప్రపంచకప్ ఆడాలనేది నా కల. దేవుడు నాకది రాసి పెట్టాడు. అందుకనే నేను ఇక్కడ ఉన్నాను అని మీడియా సమావేశంలో సిరాజ్ వెల్లడించాడు.

అఫ్ఘాన్ పై న్యూజిలాండ్ విజయం

పొట్టి ప్రపంచకప్‌ను న్యూజిలాండ్ ఘనంగా ఆరంభించింది. ఆదివారం చెన్నైలో ఆఫ్ఘానిస్థాన్‌తో జరిగిన గ్రూప్‌డీ నాలుగో మ్యాచ్‌లో కివీస్.. ప్రత్యర్థిని 5 వికెట్ల తేడాతో ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘాన్ తమ ముందుంచిన 183 పరుగుల ఛేదనను బ్లాక్ క్యాప్స్ 17.5 ఓవర్లలోనే దంచేసింది. ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (42 బంతుల్లో 65, 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌కు తోడు గ్లెన్ ఫిలిప్స్ (25 బంతుల్లో 42, 7 ఫోర్లు, 1 సిక్స్), మార్క్ చాప్‌మన్ (17 బంతుల్లో 28, 2 ఫోర్లు, 1 సిక్స్), డారిల్ మిచెల్ (14 బంతుల్లో 25, 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. ఈ మెగా టోర్నీ చరిత్రలో కివీస్‌కు ఇదే అత్యుత్తమ ఛేదన (అంతకుముందు ఇంగ్లండ్‌పై 167) కావడం విశేషం. ఛేదనలో 14 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయిన కివీస్.. తర్వాత సీఫర్ట్, ఫిలిప్స్ బాదుడుతో పుంజుకుంది. ఈ ఇద్దరూ 46 బంతుల్లోనే 74 రన్స్ జోడించారు. తర్వాత ఫిలిప్స్ నిష్క్రమించినా.. సీఫర్ట్, చాప్‌మన్ నాలుగో వికెట్‌కు విలువైన 36 రన్స్ జోడించారు. అర్ధ శతకం తర్వాత సీఫర్ట్‌ను నబీ ఔట్ చేసినా మిచెల్, కెప్టెన్ శాంట్నర్ (17*) లాంఛనాన్ని పూర్తిచేశారు. మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘాన్.. ఆరంభంలో తడబడినా గుల్బాదిన్ నయీబ్ (35 బంతుల్లో 63, 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ ఆటతో మెరుగైన స్కోరు చేసింది. సెదికుల్లా (29), గుర్బాజ్ (27) అతడికి అండగా నిలిచారు. టీ20ల్లో ప్రత్యర్థి ఎదుట 180+ టార్గెట్‌ను ఉంచి ఓడటం 26 మ్యాచ్‌ల్లో ఆఫ్ఘానిస్థాన్‌కు ఇదే ప్రథమం.

ఇంగ్లండ్‌ను వణికించిన నేపాల్

- అతికష్టం మీద నెగ్గిన ఇంగ్లండ్

టీ20 ప్రపంచకప్‌లో సంచనాలు సృష్టించేందుకు వచ్చిన చిన్న జట్లు ఆ దిశగా అగ్ర స్థాయి జట్లకు ఊహించని షాకులిస్తున్నాయి. మొదటి రోజే నెదర్లాండ్స్, యూఎస్ఏ జట్ల పోరాటపటిమతో స్ఫూర్తి పొందిన నేపాల్.. రెండుసార్లు చాంపియన్ ఇంగ్లండ్‌ను వణికించింది. ఇరుజట్ల మధ్య ముంబైలోని వాంఖెడే వేదికగా ఆఖరి బంతి వరకూ హోరాహోరీగా సాగిన గ్రూప్‌సీ మ్యాచ్‌లో ఇంగ్లిష్ జట్టు చావు తప్పి కన్ను లొట్టపోయిన చందంగా 4 పరుగుల స్వల్ప తేడాతో నేపాల్‌పై గెలిచింది. బ్రూక్ సేన నిర్దేశించిన 185 పరుగుల ఛేదనలో ఆ జట్టు.. నిర్ణీత ఓవర్లలో 180/6 వద్దే ఆగిపోయి తృటిలో సంచలనాన్ని నమోదుచేసే సువర్ణావకాశాన్ని చేజార్చుకుంది. దీపేంద్ర సింగ్ (44), కెప్టెన్ రోహిత్ (39), లోకేశ్ (39*) పోరాడారు. అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. జాకబ్ బెతెల్ (55), కెప్టెన్ హ్యారీ బ్రూక్ (52), విల్ జాక్స్ (39*) రాణించడంతో 20 ఓవర్లలో 184/7 స్కోరు చేసింది. బ్యాట్‌తో పాటు బంతితోనూ ఒక వికెట్ తీసిన జాక్స్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. మ్యాచ్‌ను చూసేందుకు నేపాలీలు భారీ స్థాయిలో వాంఖెడేకు రావడం విశేషం. పటిష్టమైన బౌలింగ్‌ను ఎదుర్కొనే క్రమంలో 42 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయినా నేపాల్ పోరాడింది. దీపేంద్ర సింగ్, రోహిత్ మూడో వికెట్‌కు 54 బంతుల్లోనే 82 రన్స్ జోడించి ఆ జట్టును పోటీలోకి తెచ్చారు. కానీ రెండు ఓవర్ల వ్యవధిలోనే ఈ ఇద్దరూ పెవిలియన్ చేరడంతో నేపాలీలు ఒకింత నిరాశే ఎదురైంది. అయితే ఆరో స్థానంలో క్రీజులోకి వచ్చిన లోకేశ్ వీరోచితంగా పోరాడాడు. 17 ఓవర్లలో 139/4గా ఉన్న ఆ జట్టు.. విజయానికి అత్యంత చేరువగా వచ్చిందంటే అది అతడి పోరాటమే.

‘ఆకాశంలో ఒక తార’
రాజమండ్రిలో క్లైమాక్స్

వరుస బ్లాక్‌బస్టర్‌లు, పాన్‌ఇండియా స్టార్‌డమ్‌తో దూసుకుపోతున్న వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్, ఇప్పుడు మరో ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ ‘ఆకాశంలో ఒక తార’తో అలరించబోతున్నారు. విలక్షణ కథలతో ఆకట్టుకునే పవన్ సాదినేని ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో, ఈ చిత్రాన్ని సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మిస్తున్నారు. దుల్కర్ సరసన కొత్త హీరోయిన్ సాత్విక వీరవల్లి కథానాయికగా నటిస్తోంది. ఇంతకు ముందు విడుదలైన ప్రోమోలు సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ సినిమా క్లైమాక్స్ షూటింగు రేపట్నుంచి రాజమండ్రిలో ప్రారంభం కానుంది. హీరోహీరోయిన్ పై క్లైమాక్స్ షూట్ చేయబోతున్నారు. డైరెక్టర్ పవన్ సాదినేని ఈ సినిమా కోసం అద్భుతమైన స్క్రిప్ట్ ని రెడీ చేశారు. బలమైన కథ, పర్ఫార్మెన్స్ లు ఉన్న క్రేజీ ప్రాజెక్టు ఇది. శృతి హాసన్ ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర చేస్తున్నారు. ఆమె ఫస్ట్ లుక్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.



స్వయంభు
టీజర్ 11న రిలీజ్

పాన్‌ఇండియా బ్లాక్‌బస్టర్ కార్తికేయ 2తో దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన నిఖిల్, ఇప్పుడు తన ప్రతిష్టాత్మక 20వ చిత్రం ‘స్వయంభు’ తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. భారీ స్థాయిలో నిర్మించబడిన ఈ హిస్టారికల్ యాక్షన్ ఎపిక్ కి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. సంయుక్త, నభా నటేష్ హీరోయిన్స్. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మించారు. ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. టాప్ క్లాస్ నిర్మాణ విలువలు, పవర్ ఫుల్ పాన్‌ఇండియా విజన్ తో వస్తున్న స్వయంభు నిఖిల్ అత్యంత ప్రతిష్టాత్మక వెంచర్లలో ఒకటిగా నిలుస్తుంది. తాజాగా మేకర్స్ బిగ్ అప్డేట్ ఇచ్చారు. ఎంతగానో ఎదురుచూస్తున్న స్వయంభు టీజర్ ఫిబ్రవరి 11న రిలీజ్ కానుంది. టీజర్ అనౌన్స్మెంట్ పోస్టర్ లో నిఖిల్ యాక్షన్ లుక్ అదిరిపోయింది. కార్తికేయ 2 తర్వాత పాన్ ఇండియా స్థాయిలో హ్యూజ్ బజ్ వున్న సినిమా. ఇందులో తన పాత్ర కోసం నిఖిల్ పూర్తిగా ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవ్వడంతో పాటు ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్నారు.

గుండె జారి గల్లంతయ్యిందే

కోమలమైన మోముతో అభిమానులను మరోసారి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది ఈ ముద్దుగుమ్మ.. తాజాగా క్రీమ్ అండ్ లైట్ మెరూన్ కాంబినేషన్ లో ఒక లాంగ్ ఫ్రాక్ ధరించి తన అందాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. చెట్ల చాటున చాలా అందంగా ఫోటోలకు ఫోజులిచ్చింది ఈ ముద్దుగుమ్మ. భాగ్యశ్రీ షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి కుర్రకారు మాత్రమే కాదు సినీ ప్రియులు కూడా పరవశించిపోతున్నారు. అటు అమ్మాయిలు సైతం ఈమె లుక్కు చూసి వావ్ అంటూ కామెంట్లు చేస్తూ ఉండడం గమనార్హం. ముఖ్యంగా కొంతమంది ఫైర్ ఏమోజీ లతో పాటు హార్ట్ ఎమోజిలు అలాగే లవ్ ఎమోజీలను షేర్ చేస్తూ.. నా మనసు దోచేశావు అంటూ మీమ్స్ కూడా షేర్ చేస్తున్నారు. మొత్తానికైతే భాగ్యశ్రీ తన లుక్కుతో అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది అని చెప్పవచ్చు.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200